జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
బుధవారం 9 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8



## కౌమార బాలబాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి




# ప్రతీ పది టన్నుల్లో తొమ్మిది టన్నులు తెలంగాణకే!








**రాష్ట్ర విద్యుత్ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న తీరుపై ప్రత్యేక కథనం**

దేశం నలుమూలల నుంచి సింగరేణి బొగ్గు కోసం వినతులు.. అయినా తెలంగాణ అవసరాలకే ప్రాధాన్యం

ఆగస్టులో విద్యుత్ రంగానికి 40.51 లక్షల టన్నుల బొగ్గు.. అందులో తెలంగాణకే 36.26 లక్షల టన్నులు

# దళిత గౌరవాన్ని తాకితే ఊరుకోం!

తాత మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే మెంగాజీ ఆగ్రహం

వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి.. తక్షణమే పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్



# దళిత గౌరవాన్ని తాకితే ఊరుకోం!

## తాత మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే మెంగాజీ ఆగ్రహం

## వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి.. తక్షణమే పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్నులే మెంగాజీ స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలకు ప్రజాస్వామ్యంలో స్థానం ఉన్నప్పటికీ, వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు మాత్రం ఎలాంటి సమర్థన ఉండదని అన్నారు. మంగళవారం టీపీసీసీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆదేశాల మేరకు వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ పదవికి గౌరవం ఉండాలి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలు తీవ్రంగా అభ్యంతరకరంగా ఉన్నాయని మెంగాజీ అన్నారు. స్పీకర్ పదవి కేవలం ఒక వ్యక్తి రాజకీయ హోదా కాదని, అది శాసన వ్యవస్థకు ప్రతీకగా నిలిచే రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నా రు. రాజకీయంగా ఎవరితోనైనా విభేదాలు ఉండొచ్చుని, ప్రభుత్వ విధానాలను విమర్శించవచ్చని, ప్రజా సమస్యలపై ప్రశ్నించవచ్చని అన్నారు. అయితే విమర్శలు వ్యక్తిగత అవమానాలకు దారితీయ కూడదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యాఖ్యలు చేసేటప్పుడు మరింత సంయమనం, బాధ్యత అవసరమన్నారు.

**తరతరాల పోరాటానికి ప్రతీక ఆత్మగౌరవం**

దళితుల ఆత్మగౌరవం ఒక్కరోజులో ఏర్పడింది కాదని మెంగాజీ అన్నారు. తరతరాలుగా సామాజిక వివక్ష, అసమానతలను ఎదుర్కొంటూ దళిత సమాజం హక్కుల కోసం పోరాడిందని గుర్తుచేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగం ద్వారా సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి విలువలకు బలమైన పునాది ఏర్పడిందన్నారు. నేడు దళిత సమాజానికి చెందిన వ్యక్తులు విద్య, ఉద్యోగం, రాజకీయాలు, ప్రజా జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగడం వెనుక అనేక తరాల పోరాటం ఉంది. అలాంటి సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను సాధారణ రాజకీయ విమర్శలుగా చూడలేం" అని మెంగాజీ పేర్కొన్నారు.

**మాటకు విలువ.. నాయకులకు బాధ్యత**

ప్రజా జీవితంలో ఉన్న నాయకులు మాట్లాడే ప్రతి మాటకు సామాజిక ప్రభావం ఉంటుందని ఆయన అన్నారు. నాయకులు మాట్లాడే మాటలను వారి అనుచరులు, కార్యకర్తలు, ప్రజలు గమనిస్తారని, అందువల్ల ప్రజాప్రతినిధులు మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పోరాటం విధానాలపై ఉండాలని, వ్యక్తిగత అవమానాలపై కాకూడదని సూచించారు. రాజకీయ ప్రత్యర్థిని విమర్శించడం ప్రజాస్వామ్య హక్కు అయినప్పటికీ, ప్రత్యర్థి వ్యక్తిగత గౌరవాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలి తాత మధు చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని దళిత సమాజానికి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని మెంగాజీ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిగణించి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు తమ నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడే విషయంలో స్పష్టమైన నియంత్రణ, బాధ్యతాయుతమైన రాజకీయ సంస్కృతిని పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలకు చోటు ఉన్నప్పటికీ, పరస్పర గౌరవం అనే ప్రాథమిక విలువను ఎవరూ విస్మరించకూడదన్నారు.

**అవమానం కాదు.. ఆత్మగౌరవమే మా బలం**

దళితుల ఆత్మగౌరవాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం లేదా అవమానించడం ఎవరికీ తగదని మెంగాజీ అన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ అనే తేడాలు లేకుండా ప్రతి మనిషి గౌరవాన్ని కాపాడే రాజకీయ సంస్కృతి రావాల్సిన అవసరం ఉందన్నారు. పదవులు మారవచ్చు.. ప్రభుత్వాలు మారవచ్చు.. రాజకీయ పరిస్థితులు మారవచ్చు. కానీ రాజ్యాంగం కల్పించిన సమానత్వం, మానవ గౌరవం, ఆత్మగౌరవం మాత్రం శాశ్వత విలువలు. రాజకీయంగా ప్రత్యర్థిని ఎదుర్కోవచ్చు.. కానీ వ్యక్తిని అవమానించే స్థాయికి రాజకీయాలను తీసుకెళ్లకూడదు" అని మెంగాజీ అన్నారు. దళితుల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో రాజ్యాంగ విలువలు, సామాజిక సమానత్వంపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా సంబంధిత పార్టీలు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**మండల కాంగ్రెస్ శ్రేణుల తీవ్ర ఆగ్రహం**

తాత మధు వ్యాఖ్యలపై వాంకిడి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దళిత సమాజం ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. తాత మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, దళిత సమాజానికి మరియు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. కేవలం విచారం వ్యక్తం చేయడం కాకుండా, చేసిన వ్యాఖ్యలపై పూర్తి



బాధ్యత తీసుకుని ప్రజల ముందు స్పష్టమైన క్షమాపణ చెప్పాలని వారు కోరారు. దళితుల ఆత్మగౌరవం, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో మరింత బలమైన ఉద్యమాలు చేపడతామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. దళితుల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీల నాయకత్వాలు తమ నేతలకు బాధ్యతాయుతమైన ప్రవర్తనపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. దళితుల గౌరవాన్ని కించపరిచే మాటలకు క్షమాపణే మొదటి సమాధానం. చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. లేదంటే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుంది" అని మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, రాజకీయాలు వేరు.. వ్యక్తిగత గౌరవం వేరు.. రాజ్యాంగ పదవుల గౌరవం మరింత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ, కులం లేదా సామాజిక నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ వ్యక్తిని అవమానించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదన్నారు. తాత మధు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు, పార్టీ నాయకత్వం తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్నులే మెంగాజీతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సెల్వట్కర్ పెంట్టు, కొడపే మారుతి, మండల మాజీ అధ్యక్షులు గుర్నులే నారాయణ, వాంకిడి టౌన్ ప్రెసిడెంట్ ధన్వల్కర్ కమలేష్ బంటి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డికొండ మహేష్, మండల నాయకులు వద్లూరి లింగమూర్తి, జాబురె గణేష్, మదపచి సీతారాం, పోర్ల శంకర్, షేక్ చాంద్ పాషా, ఆస్పక్ షేక్, అజ్మద్దీన్ షేక్, ఉప్రే ధర్మాజీ, జాడే సోమాజి, మండోకర్ అనిల్, చునర్కర్ శివాజీ, సర్పంచులు, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.జర్నలిస్ట్ కృష్ణపల్లిసురేష్!.

## తపాలా సేవలకే 'అంతరాయం'..

## ప్రజలకు తప్పని నిరీక్షణ!

**మంచిర్యాలరూరల్ సెప్టెంబర్08(ప్రజాజ్యోతి)** జిల్లా కేంద్రంలోని తపాలా సేవ కేంద్రంలో సేవలు సజావుగా అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.వివిధ పనుల కోసం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు కేంద్రానికి వస్తుండగా,సర్వర్ సమస్యలు,కౌంటర్ల కొరత, కనీస సౌకర్యాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నెల7న మంచిర్యాల పట్టణంలో బెల్లంపల్లి చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ,డ్రైనేజీ పనుల్లో భాగంగా రోడ్డు తవ్వకాలు చేపట్టడంతో నెట్‌వర్క్, ఇంటర్నెట్ కేబుల్స్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీంతో తపాలా కేంద్రంలోని ఆన్‌లైన్ సేవలకు అంతరాయం ఏర్పడి, ఉత్తరాలు పంపేందుకు వచ్చిన కొందరు ప్రజలు పనులు పూర్తికాక వెనుదిరిగినట్లు సమాచారం.అదేవిధంగా మంగళవారం కూడా సర్వర్ పునరుద్ధరణ అనంతరం కొంతసేపు సర్వర్ బిజీగా ఉండటంతో సేవలు ఆలస్యమైనట్లు ప్రజలు వాపోతున్నారు.ఉత్తరాలు స్వీకరించే ప్రక్రియలోనూ కొంత గందరగోళం ఏర్పడుతోందని వారు పేర్కొంటున్నారు




**--కూర్చునేందుకు కుర్చీలు.. తాగేందుకు నీరూ కరువే?**

తపాలా కేంద్రానికి ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు ఉత్తరాలు పంపడం,పోస్టల్ స్టాంపులు కొనుగోలు చేయడం,వివిధ ప్రభుత్వ పథకాల ప్రీమియం చెల్లింపులు తదితర సేవల కోసం వస్తుంటారు. అయితే రద్దీకి అనుగుణంగా తగినన్ని కౌంటర్లు లేకపోవడంతో గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా వృద్ధులు, మహిళలు దివ్యాంగులు కూర్చునేందుకు సరైన సౌకర్యం లేదని, తాగునీటి వసతి కూడా తగినంతగా లేదని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ప్రజా సేవా కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై వారు ప్రశ్నిస్తున్నారు.

**--అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలి**

ప్రజల రద్దీకి అనుగుణంగా మరిన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి సేవలను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.సర్వర్,నెట్‌వర్క్ సమస్యలు తలెత్తినప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పాటు,కూర్చునే సౌకర్యం,తాగునీరు వంటి కనీస వసతులు కల్పించాలని తపాలా శాఖ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# అసిఫాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల భారీ ధర్నా

**స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు**

**రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడాలని డిమాండ్**



**అసిఫాబాద్, సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ అసిఫాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులపై మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ శాసనసభ స్పీకర్ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారని, అలాంటి పదవిలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు, శాసనసభ గౌరవానికి విరుద్ధమని అన్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని, అయితే ప్రజాప్రతినిధులు తమ వ్యాఖ్యల్లో హుందాతనం, సంయమనం పాటించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ అత్యంత కీలకమైన వ్యవస్థల్లో ఒకటని, సభా వ్యవహారాలను నడిపించే స్పీకర్ స్థానానికి పార్టీలకు అతీతంగా గౌరవం ఉండాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రాజకీయ విమర్శలకు, వ్యక్తిగతంగా కించపరిచే వ్యాఖ్యలకు మధ్య తేడాను ప్రజాప్రతినిధులు గుర్తించాలని సూచించారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని మాత్రమే కాకుండా రాజ్యాంగ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కూడా దెబ్బతీసే విధంగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా సంబంధిత వ్యక్తులు బాధ్యతగా వ్యవహరించాలని, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు తమ నిరసనను వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో రాజకీయ విమర్శలు చేసుకోవాలని, వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రజాప్రతినిధులు తమ మాటల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. అసిఫాబాద్‌లో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏఎంసీ చైర్మన్ మంగ, కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్లు, మండల అధ్యక్షులు, టౌన్ ప్రెసిడెంట్, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు స్పీకర్ గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# కౌమార బాలబాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్




**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా 10 నుంచి 19 సంవత్సరాల బాలబాలికలు, పీర్ గ్రూప్ సభ్యులకు కౌమార ఆరోగ్యంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. మంగళవారం మంచిర్యాలలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కౌమార ఆరోగ్యంపై రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లో బాలబాలికలకు కౌమార ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కౌమార బాలబాలికలకు ఆరోగ్య సమాచారం అందించే సమయంలో భరోసా, నమ్మకం, గోప్యత ఎంతో ముఖ్యమన్నారు. లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం, రుతుస్రావం, గర్భనిరోధకం, ఆర్టీఐ, ఎస్టీఐ, కౌమార సమస్యలు, గాయాలు, హింస నివారణ, రక్తహీనత, మధుమేహం, రక్తపోటు తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మానసిక ఆరోగ్యం, కోపం, చిరాకు వంటి సమస్యలపై కూడా అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. మద్యం, బీడీ, సిగరెట్లు, డ్రగ్స్, గంజాయి తదితర మాదకద్రవ్యాలకు బాలబాలికలు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే వ్యసనాలకు గురైన వారికి వాటి నుంచి బయటపడేందుకు తగిన సలహాలు, మద్దతు అందించాలన్నారు. ఆరోగ్యకరమైన శరీరం, మనస్సు కోసం సరైన పోషకాహారం, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలని తెలిపారు.మంచి స్పర్శ.. చెడు స్పర్శపై అవగాహన...కౌమార బాలబాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. ఎవరైనా ఇష్టం లేని విధంగా వ్యక్తిగత శరీర భాగాలను తాకితే వెంటనే 'వద్దు' అని గట్టిగా చెప్పడం, అక్కడి నుంచి దూరంగా వెళ్లడం, నమ్మకమైన వ్యక్తికి చెప్పడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలని తెలిపారు. బాల్యవివాహాలతో అనర్థాలు.... బాల్యవివాహాల వల్ల కలిగే అనారోగ్యం, రక్తహీనత, అకాల గర్భధారణ, నిరక్షరాస్యత, ప్రసూతి మరణాలు, పేదరికం, శిశు మరణాలు వంటి సమస్యలపై బాలబాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. "మేము పిల్లలం.. అప్పుడే కాము తల్లులం" అనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బాల్యవివాహ నిరోధక చట్టం–2006 ప్రకారం బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు పూర్తికాకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పీర్ గ్రూప్ సభ్యుల సహకారంతో పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో ఈ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని జిల్లా మాస్ మీడియా అధికారిని డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సీహెచ్‌ఓలు కాకిరాల వెంకటేశ్వర్లు, పుట్ట సత్తయ్య, శ్రీనివాస్, ఆర్ఎస్ పద్మ, సుమన్, లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణను అడ్డుకున్న విద్యుత్ అమరుల పోరాటాలు

**మంచిర్యాలలో సత్తెనపల్లి రామకృష్ణ 26వ వర్ధంతి సభ**




**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 26 ఏళ్ల క్రితం వామపక్షాల ఆధ్వర్యంలో సాగిన విద్యుత్ ఉద్యమాల కారణంగానే విద్యుత్ రంగం ప్రైవేటీకరణ ప్రమాదం నుంచి రక్షించబడిందని వివిధ ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాలలో బషీర్‌బాగ్ కాల్పుల్లో అమరుడైన సత్తెనపల్లి రామకృష్ణ 26వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నాడు ప్రపంచ బ్యాంకు విధానాలకు అనుగుణంగా వ్యవహరించిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీలను ఏకపక్షంగా పెంచడంతోపాటు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రజల ప్రయోజనాల కోసం వామపక్షాలు చేపట్టిన ఉద్యమంలో ముగ్గురు యువ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఉద్యమాన్ని పోలీసుల దమనకాండతో అణచివేయాలని నాటి ప్రభుత్వం ప్రయత్నించిన నేపథ్యంలో 2000 ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రాంతంలో పోలీసు కాల్పులు జరిగాయని పేర్కొన్నారు. ఈ కాల్పుల్లో విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సత్తెనపల్లి రామకృష్ణ సెప్టెంబర్ 8న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. బషీర్‌బాగ్ పోరాట అమర వీరులను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు నేటికీ గుర్తుంచుకుంటున్నారని అన్నారు. ప్రస్తుత పాలకులు సైతం ప్రైవేటీకరణ విధానాలను కొనసాగిస్తున్నారని విమర్శించారు. రామకృష్ణ అందించిన పోరాట స్ఫూర్తితో నేటి కాలంలో ప్రజా, కార్మిక ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గొమాస ప్రకాష్, బీసీ సబ్‌ప్లాన్ సాధన సమితి నాయకులు మోతే రామదాసు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్కె మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా ధర్నా



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రోత్సాహంతోనే అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై, మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యం సరికాదని అన్నారు. ఈ సందర్భంగా నడిపెల్లి విజిత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున ప్రశ్నించే హక్కు ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఉందని, అలాంటి ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనని అన్నారు. ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా నుంచి 10 వేల మందికి తగ్గకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు తరలిరావాలి**

**టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి**



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర టీజీఈజేఏసీ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు. రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమ విజయవంతానికి మంచిర్యాల జిల్లాలో ముందస్తు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, జిల్లా ఇరిగేషన్ కార్యాలయం, ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ సెంటర్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో సమావేశాలు నిర్వహించి చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా నుంచి 10 వేల మందికి తగ్గకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తమ డిమాండ్లను తీసుకెళ్లేందుకు పెద్ద ఎత్తున హైదరాబాద్ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా కో-చైర్మన్లు పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ అత్తే సుధాకర్, బొడ్డు శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ నాగుల గోపాల్, సెక్రటరీలు నడిమెట్ల సత్యనారాయణ, తంగళ్లపల్లి తిరుపతి, వెంకటేష్, టీజీఈజేఏసీ నాయకులు జ్యోతి, పద్మలత, మున్సిపల్, ఇరిగేషన్, ఎంప్లాయ్‌మెంట్, మెడికల్ డిపార్ట్‌మెంట్ ఫోరం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్, టీజీవో, టీఎన్జీవో నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు, జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్**



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నాయకత్వంలో మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీలు, 420 హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని నడిపెల్లి విజిత్ కుమార్ అన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

**చెన్నూరులో కాంగ్రెస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన**



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ చెన్నూరులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, తాత మధుసూదన్‌లకు వ్యతిరేకంగా చెప్పుల దండలతో నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. స్పీకర్ పదవిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన బాధ్యతాయుత పదవుల్లో ఉన్న నాయకులు హుందాతనంతో వ్యవహరించాలని సూచించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా, పదవులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై సంబంధిత నాయకులు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. స్పీకర్ గౌరవాన్ని కాపాడేందుకు ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చెన్నూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత సంఘాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 75 రకాల వైద్య పరీక్షలు



## మల్టీ పారామెట్రిక్ దయాగ్నస్టిక్ సిస్టమ్స్‌తో మెరుగైన వైద్య సేవలు జిల్లా కలెక్టర్ కె. హరిత

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అధునాతన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్), ఏవియానిక్స్ డివిజన్ హైదరాబాద్, ఓమిని



యాక్టివ్ ఫౌండేషన్ సహకారంతో సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా సమకూర్చిన 22 మల్టీ పారామెట్రిక్ దయాగ్నస్టిక్ సిస్టమ్స్ ద్వారా పీహెచ్‌సీలలో సుమారు 75 రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ యువరాజ్, ఓమిని యాక్టివ్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ బటియాతో కలిసి మల్టీ పారామెట్రిక్ దయాగ్నస్టిక్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక వైద్య పరికరాల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే రోగుల వైటల్స్ మానిటరింగ్, రక్త పరీక్షలు, వివిధ ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించడం వంటి సేవలను సమర్థవంతంగా అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్నచిన్న వైద్య




పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో సహకరిస్తున్న హెచ్‌ఏఎల్ సంస్థకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రాథమిక స్థాయిలోనే ఆధునిక వైద్య సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. జిల్లా ప్రజలకు వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని కలెక్టర్ కె. హరిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగేంద్ర, ఆకాంక్షిత జిల్లా సమన్వయకర్త బాలరాజు, వైద్య అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

**జనసేనలో 20 మంది యువత చేరిక**

**పెద్దపల్లి, ఆదిలాబాద్ కో-ఆర్డినేటర్ మంచు రాజకిరణ్**



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆవుల సాగర్, పిట్టల సుధాకర్ ఆధ్వర్యంలో భారీగా చేరికలు జరిగాయి. మందమర్రి మార్కెట్ ప్రాంతానికి చెందిన రాసమల్ల రాజేష్ ఆధ్వర్యంలోని సుమారు 20 మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. పెద్దపల్లి, ఆదిలాబాద్ కో-ఆర్డినేటర్ మంచు రాజకిరణ్, పెద్దపల్లి కో-ఆర్డినేటర్ మంథని సంపత్ పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంచు రాజకిరణ్ మాట్లాడుతూ జనసేన పార్టీ యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు జనసేన పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని, అన్ని ప్రాంతాల్లో పార్టీ నాయకులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, యువతకు అవకాశాలు కల్పించడం, ప్రజలకు అందుబాటులో ఉండే రాజకీయ వ్యవస్థ కోసం జనసేన పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై యువత పెద్ద సంఖ్యలో జనసేనలో చేరుతున్నారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నల్లతిగల మహేష్, ఆవునూరి రమేష్, మల్లంపెల్లి విష్ణు, చరణ్ తదితరులు పాల్గొన్నారు. జనసేనలో చేరిన వారిలో మర్రి శ్రవణ్, మర్రి కృష్ణ, కళ్యాణ్, కుమ్మరి సూర్యచంద్ర, వినోద్, వైష్ణవ్ తదితరులు ఉన్నారు.

## బొగ్గు గని పెన్షన్ పెంపుపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయాలి

### సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** 28 సంవత్సరాలుగా పెంపుదలకు నోచుకోని కోల్ మైన్స్ పెన్షన్‌ను పెంచేలా రాష్ట్ర అసెంబ్లీ ప్రస్తుత సమావేశాల్లోనే పార్టీలకు అతీతంగా ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. 1989లో చేసుకున్న ఒప్పందం ప్రకారం మార్కెట్ లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి కోల్ మైన్స్ పెన్షన్‌ను పెంచాల్సి ఉన్నప్పటికీ, గత 28 సంవత్సరాలుగా పెన్షన్ పెంపు జరగలేదని సంఘం నాయకులు తెలిపారు. దీంతో సింగరేణి, కోల్ ఇండియా పరిధిలోని సుమారు 6 లక్షల మందికి పైగా బొగ్గు గని పెన్షన్‌దారులు చాలీచాలని పెన్షన్‌తో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు పెన్షన్‌దారులకు కరువు భత్యంతో కూడిన 50 శాతం కోల్ మైన్స్ పెన్షన్ పెంపు కల్పించాలని, ఈ అంశంపై తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రంలోని బీజేపీ--ఎన్డీఏ ప్రభుత్వానికి పంపించే విధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కార్మికుల మెరుగైన వైద్యం కోసం సింగరేణి యాజమాన్యం తెలంగాణలోని కార్పొరేట్ ఆసుపత్రులకు భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. దీనికి బదులుగా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలోనే హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యాధునిక ఆసుపత్రిని నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బొగ్గు పెన్షన్‌దారులకు వైద్య ఖర్చుల కోసం ప్రస్తుతం ఉన్న రూ.8 లక్షల పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, అధికారులకు మాదిరిగానే పెరిగిన గ్రాట్యుటీ సీలింగ్‌ను 2017 నుంచి బొగ్గు పెన్షన్‌దారులకు కూడా వర్తింపజేసి రూ.20 లక్షలు చెల్లించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. 9న విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నేడు మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సింగరేణి గార్డెన్స్‌లో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు గజెల్లి వెంకటయ్య తెలిపారు. ఈ సమావేశంలో విశ్రాంత బొగ్గు పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారానికి పలు తీర్మానాలు చేయడంతో పాటు భవిష్యత్ పోరాట కార్యక్రమాలను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏరియా నాయకులు పేరాల రాయమల్లు, భాషవోయిన పోతరాజు, సదానందం, రాజేందర్, బొట్ల కృష్ణస్వామి బింగి పోషం, దాసు సదానందం, అక్కల దుర్గయ్య, దుబాసి వెంకటస్వామి, బి. రాజనర్సు, ఎం. లక్ష్మయ్య, రామబ్రహ్మం, పెద్దపల్లి లక్ష్మయ్య, ఆర్.ఎం. సింగడే, జే. నాగేశ్వర్ రావు, ఎం. వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలో ఏర్పాటు చేయాలి

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్**

**మేయర్, డిప్యూటీ మేయర్‌కు పూలే దంపతుల చిత్రపటాలు అందజేత**





**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మహాత్మా జ్యోతి రావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల ఆశయాలను భావితరాలకు అందించడంతో పాటు, వారి సేవలను సమాజానికి నిరంతరం గుర్తుచేసే విధంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థలో వారి చిత్రపటాలను ఏర్పాటు చేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం మంచిర్యాల్ నగర మేయర్ ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ చల్ల రమ్యలను కలిసి మహాత్మా జ్యోతిరావు పూలే--సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలను బీసీ సమాజ్ పక్షాన అందజేశారు. వాటిని తమ అధికారిక కార్యాలయాల్లో గౌరవప్రదంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతి బీసీ ప్రజాప్రతినిధి తమ అధికారిక, వ్యక్తిగత కార్యాలయాల్లో పూలే దంపతుల చిత్రపటాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు, వారి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు కృషి చేయాలని కోరారు. పూలే దంపతుల సేవలను కేవలం చిత్రపటాలకే పరిమితం చేయకుండా విద్యను ప్రోత్సహించడం, సామాజిక సమానత్వం సాధించడం, మహిళా సాధికారతకు కృషి చేయడం, అణగారిన వర్గాల అభ్యున్నతికి తోడ్పడటం వంటి లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పూలే దంపతుల చిత్రపటాలను అధికారికంగా ఏర్పాటు చేసేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో వారి చిత్రపటాలను ఏర్పాటు చేసి, వారి జీవిత చరిత్ర, మహిళా విద్య కోసం చేసిన కృషి, సామాజిక సమానత్వం కోసం సాగించిన పోరాటాన్ని విద్యార్థులకు పరిచయం చేయాలని సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు విద్య, మహిళా విద్య, సామాజిక సమానత్వం, మహిళా సాధికారత, అణగారిన వర్గాల అభ్యున్నతి, ఆత్మగౌరవం కోసం చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. వారి చిత్రపటం ఏర్పాటు చేయడం కేవలం గౌరవ సూచకం మాత్రమే కాకుండా, వారి ఆశయాలను స్మరించుకుంటూ విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆచరణలో పనిచేయాలనే బాధ్యతకు ప్రతీకగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా కార్యదర్శి బియ్యాల సత్తయ్య, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుతోట పద్మాదేవి, మంచిర్యాల్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఇనవంక నాగలక్ష్మి, గాండ్ల తిలకేశ్వర రాష్ట్ర నాయకులు జక్కం రవీందర్, నాయి బ్రాహ్మణ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల చంద్రయ్య, మైనార్టీ నాయకులు ఎండి హుస్సేన్, బీసీ సమాజ్ జిల్లా నాయకులు గొల్ల సత్యనారాయణ, పాదిశెట్టి వినోద్, పట్టణ నాయకులు చల్ల విజయ్ కుమార్, తాటిపాముల సమ్మయ్య, పల్లపు శ్రీనివాస్, ముదిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**చెన్నూరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ**



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెన్నూరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శాసన సభ అనేది ప్రజల సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను చూపించే పవిత్రమైన వేదిక అని, అలాంటి సభలో స్పీకర్ స్థానానికి, సభా మర్యాదలకు భంగం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం ఉందని, ఆ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని పేర్కొన్నారు. నిన్న అసెంబ్లీలో చోటుచేసుకున్న ఘటనపై ప్రభుత్వం, శాసనసభ తగిన విధంగా స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా చెన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే, మాజీ మంత్రి వివేక్ వెంకటస్వామిపై అనవసర విమర్శలు చేస్తున్నారని చెన్న సూర్యనారాయణ ఆరోపించారు. చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి వాటి సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఎన్ని అభివృద్ధి పనులు చేపట్టినా వాటిని స్వాగతించాల్సిన ప్రతిపక్ష నాయకులు రాజకీయ కక్షతో వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదన్నారు. చెన్నూరులో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతులు తదితర రంగాల్లో అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి పనులపై నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిన బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో ప్రజా సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు అభివృద్ధి పనులపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. చెన్నూరు నియోజకవర్గ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, ఎవరు అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు, ఎవరు కేవలం రాజకీయ విమర్శలకు పరిమితమవుతున్నారో ప్రజలకు స్పష్టంగా తెలుసని చెన్న సూర్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో చెన్నూరును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తారని తెలిపారు. రాజకీయ విభేదాలు ఉన్నా వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ప్రజాస్వామ్య విలువలు, సభా మర్యాదలను కాపాడుతూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధినే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని చెన్న సూర్యనారాయణ కోరారు.

## గణేష్ నిమజ్జన కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ నితికా పంత్

**నిమజ్జన కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి**



**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి): జర్నలిస్ట్ కృష్ణపల్లి సురేష్:** రాబోయే గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధమవుతోందని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రధాన గణేష్ నిమజ్జన కేంద్రాలైన ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పెద్దవాగును జిల్లా ఎస్పీ నితికా పంత్ స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గణేష్ మండపాల నుంచి నిమజ్జన కేంద్రాల వరకు జరిగే ఊరేగింపు మార్గాలను పరిశీలించిన ఎస్పీ, నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలు, పార్కింగ్, బారికేడింగ్ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల్లో బారికేడింగ్, రోప్ బ్యారియర్స్, తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. గణేష్ విగ్రహాలతో వచ్చే వాహనాల కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ రూపొందించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని, భారీగా ప్రజలు గుమిగూడే ప్రాంతాల్లో క్రౌడ్ మేనేజ్‌మెంట్‌తో పాటు నిరంతర పోలీస్ పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా పరిస్థితులను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నీటి వనరుల వద్ద ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, నిమజ్జన సమయంలో ఉపయోగించే క్రేన్‌లు, ఇతర యంత్ర పరికరాలు సురక్షితంగా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. గణేష్ నిమజ్జన కేంద్రాల వద్ద వైద్య, అగ్నిమాపక, రక్షణ బృందాలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే స్పందించేలా క్విక్ రెస్పాన్స్ టీమ్స్‌ను సిద్ధంగా ఉంచాలని, మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలు లేదా కుటుంబ సభ్యులు తప్పిపోయిన సందర్భాల్లో వెంటనే సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్ లేదా అవసరమైన సహాయక వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. గణేష్ మండపాల నుంచి నిమజ్జన కేంద్రాల వరకు జరిగే ఊరేగింపులు క్రమబద్ధంగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులకు ఆదేశించారు. ఒకేసారి భారీగా వాహనాలు, ప్రజలు నిమజ్జన కేంద్రాల వద్దకు చేరకుండా క్రమబద్ధమైన రాకపోకలు, అవసరమైన ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజలతో సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి గణపతి నిమజ్జన కార్యక్రమంలో ప్రజలు పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు. పిల్లలను ప్రత్యేకంగా జాగ్రత్తగా చూసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని ఆమె కోరారు.

# తెలంగాణ వెలుగులకు సింగరేణి భరోసా
# స్వరాష్ట్ర విద్యుత్ అవసరాలకే 90 శాతం సరఫరా

## రాష్ట్ర విద్యుత్ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న తీరుపై ప్రత్యేక కథనం

**దేశం నలుమూలల నుంచి సింగరేణి బొగ్గు కోసం వినతులు.. అయినా తెలంగాణ అవసరాలకే ప్రాధాన్యం**

**ఆగస్టులో విద్యుత్ రంగానికి 40.51 లక్షల టన్నుల బొగ్గు.. అందులో తెలంగాణకే 36.26 లక్షల టన్నులు**







**మంచిర్యాల, 8,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతూ.. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు అవసరాలు అధికమవుతున్న వేళ సింగరేణి సంస్థ స్వరాష్ట్రమైన తెలంగాణకు అండగా నిలుస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో దేశంలోని పలు విద్యుత్ సంస్థలు సింగరేణి వైపు చూస్తూ.. 'మాకూ బొగ్గు సరఫరా చేయండి' అంటూ కోరుతున్నాయి. సింగరేణి బొగ్గుకు ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ సంస్థ మాత్రం తెలంగాణ విద్యుత్ అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు భరోసా కల్పించాలన్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణలోని విద్యుత్ కేంద్రాలకు సింగరేణి నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేస్తోంది. కీలక సమయాల్లో విద్యుత్ రంగానికి అండగా నిలుస్తూ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి చోదకశక్తిగా మారుతోంది. ఇతర రాష్ట్రాలకు బొగ్గు విక్రయం ద్వారా వాణిజ్య అవకాశాలు ఉన్నప్పటికీ.. 'సంస్థ వాణిజ్య ప్రయోజనాల కన్నా స్వరాష్ట్ర ప్రయోజనాలే ప్రాధాన్యం' అన్న విధానంతో ఉత్పత్తి చేసిన బొగ్గులో తెలంగాణ అవసరాలకే సింహభాగం కేటాయిస్తూ తద్వారా రాష్ట్ర విద్యుత్ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న తీరుపై ప్రత్యేక కథనం.

**ప్రతీ పది టన్నుల్లో తొమ్మిది టన్నులు తెలంగాణకే!**

సింగరేణి సంస్థ తాను ఉత్పత్తి చేసిన బొగ్గును దీర్ఘకాలిక ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలకు సరఫరా చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలు విద్యుత్ సంస్థలకు కొన్ని దశాబ్దాలుగా బొగ్గు రవాణా చేస్తూ ఆయా రాష్ట్రాల ఇంధన అవసరాలను తీరుస్తోంది. అయితే దేశంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాకాలంలోనూ విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణ విద్యుత్ అవసరాలకు సింగరేణి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యుత్ రంగానికి సరఫరా చేస్తున్న ప్రతీ పది టన్నుల బొగ్గులో దాదాపు తొమ్మిది టన్నులు తెలంగాణలోని విద్యుత్ కేంద్రాలకే చేరుతుండటం విశేషం. గత నెలలో (ఆగస్టులో) సింగరేణి 40,51,312 టన్నుల బొగ్గును దేశంలోని విద్యుత్ సంస్థలకు సరఫరా చేయగా.. అందులో 36,25,937 టన్నుల బొగ్గును తెలంగాణలో ఉన్న విద్యుత్ సంస్థలకు రవాణా చేయడం జరిగింది. అంటే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న జెన్ కోలకు దాదాపు 90 శాతం సరఫరా జరిగింది. సగటున ఒక రోజుకు 1,30,687 టన్నుల బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేస్తుండగా.. తెలంగాణ థర్మల్ కేంద్రాలకు సగటున రోజుకు 1,16,966 టన్నుల బొగ్గును అందిస్తూ రాష్ట్ర ఇంధన అవసరాలు తీరుస్తోంది.

**అత్యధికంగా టీజీ జెన్ కోకు 50 శాతం బొగ్గు...**

గత నెలలో కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రానికి 6,99,661 టన్నుల బొగ్గును 179 రేకుల ద్వారా సరఫరా చేయడం జరిగింది. సగటున రోజుకు 22,570 టన్నుల చొప్పున సగటున రోజుకు ఆరు రేకుల ద్వారా రవాణా జరిగింది. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 7,99,017 టన్నుల బొగ్గును 203 రేకుల ద్వారా సరఫరా చేయడం జరిగింది. ఈ లెక్కన సగటున రోజుకు 25,775 టన్నుల బొగ్గు సగటున రోజున 7 రేకుల ద్వారా రవాణా అయింది. భూపాలపల్లి లోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ కు 1,02,959 టన్నుల బొగ్గును రవాణా చేసింది. కాగా భద్రాద్రి థర్మల్ ప్లాంట్ కు 4,14,719 టన్నుల బొగ్గును సగటున రోజుకు 13,378 టన్నుల చొప్పున బొగ్గును రవాణా చేయడం జరిగింది. మొత్తం మీద చూస్తే తెలంగాణ జెన్కోకు గత నెలలో 382 రైల్వే రేకుల ద్వారా 20,16,356 టన్నుల బొగ్గును సింగరేణి సంస్థ రవాణా చేసింది. ఈ మొత్తం రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేసిన బొగ్గులో 50 శాతం కావడం విశేషం. అలాగే రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చుతున్న రామగుండం ఎన్టీపీసీ ప్లాంట్లకు 7,28,164 టన్నుల బొగ్గును, అలాగే ఎన్టీపీసీ తెలంగాణ ప్లాంట్‌కు 4,15,839 టన్నుల బొగ్గును సరఫరా చేయడం జరిగింది సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (జైపూర్)కు 4,65,579 టన్నుల బొగ్గును సరఫరా చేయడం జరిగింది.

**సింగరేణి బొగ్గు కోసం ఇతర రాష్ట్రాల వినతులు...**

దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు నిరంతర సరఫరా కీలకంగా మారింది. ఈ పరిస్థితుల్లో సింగరేణి బొగ్గుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా డిమాండ్ పెరుగుతోంది. కొన్నేళ్లుగా సింగరేణికి వినియోగదారుగా ఉన్న పశ్చిమబెంగాల్ లోని దామోదర వ్యాలీ కార్పొరేషన్ డీవీసీ నుంచి 1 మిలియన్ టన్నులు, దుర్గాపూర్ లోని ఎన్ టీ ఈసీఎల్ నుంచి 1.2 మిలియన్ టన్ను, ఎన్ఎస్‌పీసీఎల్--ఝజ్జర్ (ఆరావళి) నుంచి 1 మిలియన్ టన్నుల, తమిళనాడులోని ఎన్‌టీఈసీఎల్ నుంచి 2 మిలియన్ టన్నుల బొగ్గుకు, ఇతర విద్యుత్ సంస్థలు తమకు సింగరేణి బొగ్గును రవాణా చేయాలని కోరుతున్నాయి.బొగ్గుకు ఇంత తీవ్రమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో సింగరేణి సంస్థ దీనిని వ్యాపారాత్మకంగా మలుచుకునే అవకాశాలు ఉన్నప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇతర రాష్ట్రాల డిమాండ్లను పక్కకు పెట్టి రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును సరఫరా చేస్తుంది.

**రాష్ట్ర అవసరాలకు ఒడిశాలోని నైనీ బొగ్గు కూడా..**

ఒడిశాలో సింగరేణి సంస్థ ఉత్పత్తిని ప్రారంభించిన నైనీ బొగ్గు గని



నుంచి కూడా బొగ్గును స్వరాష్ట్రానికి తరలిస్తోంది. ఇప్పటికే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఒక్కొక్కటి చొప్పున రైల్వే రేకుల ద్వారా బొగ్గును సరఫరా చేసింది. ఒడిశాలో రవాణా ఇబ్బందులు ఉన్నప్పటికీ రానున్న రోజుల్లోనూ మరింత బొగ్గు సరఫరా చేసేందుకు సంసిద్ధంగా ఉంది. నైనీలో ప్రస్తుతం 15 లక్షల టన్నుల బొగ్గు వెలికితీయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ... కేవలం రాత్రి వేళలో మాత్రమే అక్కడ బొగ్గును రైల్వే సైడింగ్ వరకు రవాణా చేయడానికి అనుమతి ఉన్నందున ఎక్కువ పరిమాణంలో బొగ్గు సరఫరాను పెంచలేని పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ఉత్పత్తి చేస్తున్న నైనీ బొగ్గును కూడా రాష్ట్ర ప్రయోజనాలకు వినియోగిస్తోండటం గమనార్హం.

**ప్రత్యేక అధికారుల నియామకం ద్వారా నిరంతర రవాణాకు చర్యలు**

రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క గత కొద్ది నెలలుగా సింగరేణి సహా ఇంధన సంస్థలతో అత్యున్నత సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసి తగినంత బొగ్గు సరఫరాపై మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి, రవాణాను క్రమంగా పెంచుతోంది. నాణ్యమైన బొగ్గును సకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయటం కోసం సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అయిదు గురు ప్రత్యేక అధికారులను పర్యవేక్షణ కోసం నియమించారు. దీనితో తగినంత బొగ్గు ఉత్పత్తి జరగటమే కాక సకాలంలో సీహెచ్ పీల ద్వారా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా అవుతోంది. ఇందుకు తగినన్ని రైల్వే రేకులను సమకూర్చుకోవడం, రవాణా చేయటం జరుగుతుంది. ఎల్‌నినో వల్ల రాష్ట్రంలోని విద్యుత్ డిమాండ్ గతంతో పోల్చితే పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఇతర రాష్ట్రాలకు సరఫరాను తగ్గించడం జరిగింది.

# మంచిర్యాల నగర హిందూ ఉత్సవ సమితి నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది దేగ రవీందర్..**

**ప్రధాన కార్యదర్శిగా కర్ణకంటి రవీందర్...**



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మంచిర్యాల నగర హిందూ ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని జిల్లా సంఘచాలకులు డాక్టర్ బద్రినారాయణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది దేగ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా కర్ణకంటి రవీందర్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇరుకుల సత్యనారాయణ, నరెడ్ల శ్రీనివాస్, బోయిని హరికృష్ణ, పాలమాకుల వెంకటరెడ్డి, పూజారి ప్రభాకర్, తూముల వెంకటేష్, ఇరుకుల్ల రాజేశం, కోశాధికారులుగా ముత్యాల కృష్ణ, కైరోదు సురేంద్రచారి ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా రాముగారి శ్రీనివాస్, మల్కా ప్రతాప్, సందేశ్ గుప్తా, మణికంఠ, కొండ కార్తీక్, ఆకుల సంతు, కీర్తి నవీన్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా సుందర్ బల్దవ, కంకణాల భాస్కర్, కర్రె లచ్చన్న, తోట తిరుపతి, మోదంపురం వెంకటేశ్వర్లు, కండే బద్రి నారాయణలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర సహ కార్యవాహ బాపూజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, మంచిర్యాల నగరంలో హిందూ పండుగలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను సమష్టిగా నిర్వహిస్తూ హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఫిజియోథెరపీ వైద్యుడికి సన్మానం



**రామకృష్ణాపూర్,సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి):** ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా ప్రజా జాగృతి సమితి ఆధ్వర్యంలో ప్రముఖ ఫిజియోథెరపీ వైద్యుడు డా. సిరికొండ తిరుపతిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు, న్యాయవాది రాజలింగు మోతె మాట్లాడుతూ.. ప్రమాదాలు, కీళ్ల నొప్పులు, వెన్నునొప్పి, పక్షవాతం తదితర సమస్యల నుంచి కోలుకోవడంలో ఫిజియోథెరపీ కీలకమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న వైద్యులను గౌరవించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు వీర్ల నాగరాజు, కల్లూరి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.


# బియ్యాన్ని త్వరగా అందించాలి

## రైస్ మిల్లర్లకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బియ్యాన్ని త్వరగా అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. భీమారం మండలం అంకుశాపూర్ గ్రామంలోని సమతా రైస్ మిల్లును మంగళవారం ఆకస్మికంగా సందర్శించి మిల్లు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రైతుల సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా కేటాయించడం జరిగిందని, రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని త్వరగా మర ఆడించి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మద్దికల్ గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించిన కలెక్టర్ ప్రతిరోజూ తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, నీటి నిల్వలు లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేసుకోవాలని, నిర్దేశిత విస్తీర్ణంలో నిర్మించిన ఇళ్లకు మాత్రమే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామంలో కొంతమంది రైతులు వరి సాగు చేస్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ వారితో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అయితే బోర్లు, చెరువు నీటి సౌకర్యం అందుబాటులో ఉండటంతో వరి సాగు చేస్తున్నామని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా చేపడుతున్న రీ సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్‌లలో వివరాలను నమోదు చేస్తూ సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రీ సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆరేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నోటీసుల జారీ, విచారణ కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం తయారీలో పరిశుభ్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ఆరో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి స్వయంగా వారికి పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలని సూచించారు. నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని కూడా సందర్శించిన కలెక్టర్ దానిని ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో మండల తహసిల్దార్ సదానందం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌కు అనుమతి కోరుతూ కలెక్టర్‌కు టీజీఈజేఏసీ వినతి



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మంచిర్యాల జిల్లా టీజీఈజేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్  వినతిపత్రం అందజేశారు. టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లాకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమానికి జిల్లా స్థాయిలో అనుమతి మంజూరు చేయాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) పి.చంద్రయ్య ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి చలో హైదరాబాద్ కార్యక్రమం, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై వివరించారు. అడిషనల్ కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ జిల్లా కో-చైర్మన్లు ఎస్. కిషన్, శ్రీనివాస్ దేశ్‌పాండే, దుర్గా ప్రసాద్, పొన్న మల్లయ్య, రౌఫ్ ఖాన్, సురేఖ, శ్రీపతి బాపురావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ అత్తే సుధాకర్, బొడ్డు శ్రావణ్‌కుమార్, వైస్ చైర్మన్ సునీత, పబ్లిసిటీ సెక్రటరీ రాంకుమార్, సెక్రటరీలు నడిమెట్ల సత్యనారాయణ, తంగళ్లపల్లి తిరుపతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టీజీవో, టీఎన్జీవో నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు, జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని టీజీఈజేఏసీ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు.

## ఫుట్‌బాల్ పోటీల్లో ఆర్‌కే-7 గ్రూప్ విజయం



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ ఏరియాలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఇంటర్ డిపార్ట్మెంటల్ క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం ఫుట్‌బాల్ మ్యాచ్‌లు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో ఆర్‌కే-7 గ్రూప్ జట్టు విజేతగా నిలవగా, అదర్స్ గ్రూప్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మొదటి మ్యాచ్‌లో అదర్స్ గ్రూప్, ఎస్ఆర్‌పీ గ్రూప్ జట్లు తలపడగా, అదర్స్ గ్రూప్ జట్టు 4--0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఆర్‌కే-7 గ్రూప్, ఐకే గ్రూప్ జట్లు పోటీ పడగా, ఆర్‌కే-7 గ్రూప్ జట్టు 2--0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మొదటి రెండు మ్యాచ్‌లలో విజయం సాధించిన అదర్స్ గ్రూప్, ఆర్‌కే-7 గ్రూప్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో ఆర్‌కే-7 గ్రూప్ జట్టు 2--0 గోల్స్ తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. అదర్స్ గ్రూప్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఇంటర్ డిపార్ట్మెంటల్ క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం హాకీ మ్యాచ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సర్పంచ్ మహేష్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**దండేపల్లి,సెప్టెంబర్08(ప్రజాజ్యోతి):**లక్ష్మీకాంతాపూర్ సర్పంచ్ చిలుకూరి మహేష్‌ను దండేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మంగళవారం పరామర్శించారు. మహేష్ తండ్రి చిలుకూరి రాజన్న (75) ఇటీవల మరణించడంతో లక్ష్మీకాంతాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు, రాజన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముద్దసాని వేణు, జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీ జాబు కాంతారావు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వనపర్తి రవి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కంది సతీష్ పాల్గొన్నారు. అలాగే సర్పంచ్‌లు అక్కల సత్యనారాయణ, పెంట సత్తయ్య, ఎల్లావు శ్రీనివాస్, సారాల సోనియా కిరణ్, ఉప సర్పంచ్‌లు మలవత్ రాజు, కరుకూరి తిరుపతి, బొడ్డు చరణ్, నెల్కి వెంకటాపూర్ సొసైటీ సభ్యులు అద్దె కాంతారావు, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల లచ్చన్న, మాజీ ఎంపీటీసీలు తోట మోహన్, బొడ్డు కమలాకర్ పాల్గొన్నారు. వీరితో పాటు నాయకులు అక్కల బుచ్చన్న, పెంట మల్లయ్య, రవీందర్, కథులాపురం శంకర్, ఈర్ల లక్ష్మణ్, చుక్కన్న, వెంకటేష్, నాగేష్ తదితరులు ఉన్నారు.

# ఖర్గేకు జరిగిన అవమానాన్ని తీవ్రంగా ఖండించిన ఎంపీ వంశీకృష్ణ

### ఎస్సీ, ఎస్టీల గౌరవం, హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ఎంపీల పోరాటం

### ఈ నెల 12న జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పర్యటించిన ప్రాంతంలో "శుద్ధికరణ" పేరుతో జరిగిన ఘటనను కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉందని కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వివక్షాపూరిత చర్యలను ప్రజాస్వామ్య భారతదేశంలో ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. అక్బర్ రోడ్‌లోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం తొలి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎంపీ బలరాం నాయక్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న వివక్ష, వారి హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు ఎంపీలను పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. స్టేషన్ వద్ద భారీ గేట్లు ఏర్పా టు చేయడంతో పాటు పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పర్యటించిన ప్రాంతంలో "శుద్ధికరణ"కు పాల్పడిన వ్యక్తులపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీలు డిమాండ్ చేశారు. ఒక వ్యక్తి కులం ఆధారంగా అవమానించడం, ఆయన పర్యటించిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం వంటి చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని తీవ్రంగా ఖండించారు. దేశానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న ఖర్గేను కులం పేరుతో అవమానించడం అత్యంత బాధాకరమైన విషయమ న్నారు. ఎస్సీ, ఎస్టీల గౌరవం, హక్కులు, ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో కుల వివక్షకు, అంటరానితనానికి, దళితుల అవమానానికి ఎలాంటి స్థానం ఉండకూడదని వంశీకృష్ణ అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై ఎక్కడ అన్యాయం జరిగినా కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, వారి హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఖర్గేకు జరిగిన అవమానానికి నిరసన గా ఈ నెల 12న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వ హించనున్నట్లు కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ప్రకటించింది. ఈ ధర్నాను విజయవంతం చేసి, కుల వివక్షకు వ్యతిరేకంగా దేశవ్యా ప్తంగా బలమైన సందేశం ఇవ్వాలని ఎంపీలు పిలుపునిచ్చారు.

## సింగరేణిలో వెంటనే కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

**గుర్తింపు సంఘాల రెండేళ్ల కాలపరిమితి ముగిసింది**

**టీబీజీకేస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి**

**డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సీఎండీకి వినతిపత్రం**



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో గుర్తింపు పొందిన కార్మిక సంఘాల రెండేళ్ల కాలపరిమితి పూర్తయినందున వెంటనే కొత్త కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేస్) అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్), సింగరేణి సీఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో కార్మిక సంఘాల ఎన్నికలు గతంలో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో 27 డిసెంబర్ 2023న నిర్వహించారని తెలిపారు. అదే రోజున డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (హైదరాబాద్) కార్యాలయం ఎన్నికల ఫలితాలను ప్రకటించి, గుర్తింపు పొందిన యూనియన్ హోదాను వెల్లడించిందన్నారు. అయితే యూనియన్ల అంతర్గత అంశాల కారణంగా ఎన్నికైన సంఘాలకు గుర్తింపు, ప్రాతినిధ్య హోదా పత్రాలు 9, సెప్టెంబర్, 2024న అందాయన్నారు. ఎన్నికలు జరిగిన తేదీ 27 డిసెంబర్ 2023 నుంచి లెక్కించినా ఇప్పటికే రెండేళ్లకు పైగా కాలం పూర్తయిందని, గుర్తింపు హోదా పత్రాలు అందుకున్న తేదీని ప్రాతిపదికగా తీసుకున్నా 8, సెప్టెంబర్ ,2026తో రెండేళ్ల కాలపరిమితి పూర్తయిందని రాజిరెడ్డి తెలిపారు. కాబట్టి ఇక ఆలస్యం చేయకుండా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి టీబీజీకేస్ తరపున హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ నేడు విచారణకు వచ్చినప్పటికీ, తదుపరి విచారణను 22వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. సింగరేణిలో ఇప్పటివరకు ఏడు దఫాలుగా కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించారని, గత ఎన్నికలకు ముందు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయం రెండేళ్ల కాలపరిమితితోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేసిందని రాజిరెడ్డి తెలిపారు .సింగరేణి సంస్థలో ప్రజాస్వామ్యయుతమైన, పారదర్శకమైన కార్మిక ప్రాతినిధ్య వ్యవస్థ కొనసాగాలంటే కొత్త కార్మిక సంఘాల ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించాలని ఆయన కోరారు. ఎన్నికలు పూర్తయి ఫలితాలు ప్రకటించే వరకు సింగరేణిలో పనిచేస్తున్న అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా (ఈక్వల్ స్టేటస్) కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు జరిగే వరకు అన్ని యూనియన్లకు సమాన ప్రాతినిధ్య అవకాశం కల్పించడం ద్వారా కార్మికుల సమస్యలను సమర్థవంతంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వర్తించే నిబంధనలు, విధివిధానాల ప్రకారం తక్షణమే ఎన్నికల ప్రక్రియ చేపట్టేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించేలా చర్యలు తీసుకోవాలని టీబీజీకేస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి కోరారు.

# ఆనందంగా గణేష్ ఉత్సవాలుజరుపుకోవాలి

**అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమన్వయంతో నిర్వహిద్దాం, అందరికీ ఆదర్శంగా నిలుద్దాం**

**వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** గణేష్ చతుర్థి పర్వదినం సందర్భంగా ఈ నెల 14న ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలు, 25న నిర్వహించే గణేష్ విగ్రహాల నిమజ్జనంతో ముగియనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లకు చెందిన హిందూ మత పెద్దలు,గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధ్యక్షతన కాన్ఫరెన్స్ హాల్‌లో సమన్వయ సమావేశంను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ: ప్రతి పండుగను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ నెల 14న గణేష్ చతుర్థి, 25న గణేష్ విగ్రహాల నిమజ్జనం ఉంటుందని, విగ్రహాల ఏర్పాటు నుంచి మండపాల నిర్వహణ,విగ్రహాల రవాణా,భక్తుల రద్దీ నియంత్రణ, శోభాయాత్ర, నిమజ్జనం వరకు ప్రతి దశలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తెలంగాణ పోలీస్ శాఖ గణేష్ మండపాల వివరాలను సేకరించి,వాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసే మండపాలు, విగ్రహం ఎత్తు, వాహనాల ఎత్తు, నిర్వాహకుల వివరాలు, శోభాయాత్ర రూట్, నిమజ్జనానికి ఉపయోగించే వాహనాలు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు పూర్తి వివరాలతో సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీపీ సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రతి మండపాన్ని జియోట్యాగింగ్ చేసి 'టీజీ-కాప్' పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. జియోట్యాగింగ్ ద్వారా సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు మండపాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుంటుందన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా శోభాయాత్ర సాఫీగా సాగేలా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి, ఏర్పాట్లను పర్యవేక్షిస్తామని తెలిపారు.

**మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు**

గణేష్ మండపాల వద్ద జరిగే కార్యక్రమాలకు బాధ్యత వహిస్తూ ప్రతి




మండప కమిటీ అధ్యక్షుడు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారు. గణేష్ మండపాలను ప్రజల వాహనాల రాకపోకలకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి విగ్రహం వద్ద 24 గంటలు ఇద్దరు వ్యక్తులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. పాయింట్ బుక్ ఏర్పాటు చేసి, బ్లూ కోట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది ద్వారా మండపాలను నిరంతరం తనిఖీ చేస్తారు. మండపాల పేరుతో ఎలాంటి లక్కీ డ్రాలు నిర్వహించకూడదు.అలాగే జూదం నిర్వహించరాదు. ఎవరినీ బలవంతంగా చందాలు అడగకూడదు. గణేష్ మండపాల వద్దకు ఎవరూ మద్యం సేవించి రాకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి. ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదు. విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా మండపాలకు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయకూడదు. విద్యుత్ కనెక్షన్లు, లైట్ల ఏర్పాటులో నాణ్యమైనవైర్లు, పరికరాలను మాత్రమే వినియోగించాలి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి అవసరమైన ప్రదేశాల్లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫైర్ బాల్స్,నీటి బకెట్లు అందుబాటులో ఉంచాలి. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాలు, పరిసర ప్రాంతాలు, నిమజ్జనానికి వెళ్లే మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలి. డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదు. ఇతర మతాలను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడడం లేదా ప్రసారం చేయడం వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలి. ఉత్సవాలను సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలి. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, పుకార్లు లేదా ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోస్టులు చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా



ఉండాలి.సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని చూసి సంయమనం పాటించాలని, సమాచారం నిజమా, అబద్ధమా అనే విషయాన్ని స్థానిక పోలీసులను సంప్రదించి నిర్ధారించుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే డయల్-112కు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలి. సోషల్ మీడియా లో అసత్య ప్రచారాలు చేస్తూ మత ఘర్షణలకు, శాంతిభద్రతల సమస్యలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని మతాలకు సంబంధించిన సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతరం నిఘా ఉంచాలని,ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను సంతోషకర వాతావరణంలో నిర్వహించుకునేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ అధికారులను ఆదేశించారు. గణేష్ విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో పోలీస్ శాఖ రూపొందించిన రూట్ మ్యాప్‌ను తప్పనిసరిగా అనుసరించాలని, పోలీసులకు శాంతి కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని సీపీ కోరారు. పండుగలో ఆనందం వెల్లివిరియాలి... విషాదానికి తావుండకూడదు. అందరం సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించుకుందామని సీపీ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏసీపీలు ఏ. వెంకటేశ్వర్లు, టీ.ప్రవీణ్ కుమార్, రామగుండం సీఐ కృష్ణ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు భూమేష్, చంద్రశేఖర్, సంధ్యారాణి, మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సీ అభ్యర్థులకు స్వయం ఉపాధి అవకాశాలు

**మంజూరైన యూనిట్లు అర్హులకు అందేలా చర్యలు: కలెక్టర్ హరిత**




**ఆసిఫాబాద్, సెప్టెంబరు 8 ప్రజా జ్యోతి** జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ అభ్యర్థుల స్వయం ఉపాధి పథకం ఆర్థిక పురోగతిపై నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి ఆమె హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి పథకం కింద మంజూరైన యూనిట్లు అర్హులైన అభ్యర్థులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పథకాల ద్వారా ఎస్సీ అభ్యర్థుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచి, స్వయం ఉపాధి ద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ కార్యనిర్వహణ సంచాలకులు సురేష్‌కుమార్, ఎస్సీ అభివృద్ధి అధికారి ఎం.అశోక్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జనార్ధన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మసూద్ అలీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణిలో భారీగా మైనింగ్ అధికారుల బదిలీలు

## 34 మంది మైనింగ్ అధికారులకు స్థానచలనం

మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో భారీగా మైనింగ్ అధికారుల బదిలీలు జరిగాయి. సంస్థ ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మొత్తం 34 మంది మైనింగ్ అధికారులను వివిధ ఏరియాలు, విభాగాలకు బదిలీ చేస్తూ పోస్టింగులు ఇచ్చారు. పరిపాలనా అవసరాలు, విధుల సమర్థ నిర్వహణలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన అధికారులు వెంటనే తమకు కేటాయించిన కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని యాజమాన్యం ఆదేశించింది. బదిలీల్లో జి. శ్రీనివాస్ (ఏజీఎం)ను ఆర్జీ-1 ఏరియాలోని ఏఓ 11 గ్రూప్ నుంచి హైదరాబాద్‌లోని స్ట్రాటజిక్ ప్లానింగ్ విభాగానికి, ఎ. నెహ్రూ (ఏజీఎం)ను ఆర్జీ-2 ఏరియాలోని ఏఓ 8 గ్రూప్ నుంచి ఆర్జీ-1 ఏరియాలోని ఏఓ 11 గ్రూప్‌కు, బి. శ్రీనివాస్ (డిప్యూటీ జీఎం)ను కార్పొరేట్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ నుంచి కార్పొరేట్ పర్చేజ్ విభాగానికి, విజయ్ కుమార్ (డిప్యూటీ జీఎం)ను శ్రీరాంపూర్ ఏరియా సేఫ్టీ విభాగం నుంచి ఆర్జీ-2 ఏరియాలోని ఏఓ 8 గ్రూప్‌కు, జి. శంకర్ (డిప్యూటీ జీఎం)లను ఆర్జీ-3 ఏరియాలోని ఎస్ఎంఎస్ ప్లాంట్ నుంచి భూపాలపల్లి ప్రాంతంలోని పీవో, వీకేఓసీకి బదిలీ చేశారు. అలాగే రామన్ వి.వి. పాఠక్ (ఎస్ఓఎం)ను మందమర్రి ఏరియా సేఫ్టీ విభాగం నుంచి భూపాలపల్లి ఏరియా జీఎంకు ఎస్ఓగా, తోట సత్యనారాయణ (ఎస్ఓఎం)ను ఎస్పీఎల్ ఏరియా జీఎంఓ నుంచి శ్రీరాంపూర్ ఏరియాలో అసిస్టెంట్ సేఫ్టీ ఆఫీసర్‌గా, జి. నాగేశ్వరరావు (ఎస్ఓఎం)ను మందమర్రి ఏరియా ఎంవీటీసీ నుంచి అదే ఏరియాలో అసిస్టెంట్ సేఫ్టీ ఆఫీసర్‌గా, కొర్ర రామదాసు (ఎస్ఓఎం)లను యెల్లందు ఏరియా క్యూఎం విభాగం నుంచి అదే ఏరియాలో అసిస్టెంట్ సేఫ్టీ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. కరంపూడి రామరాజు (మేనేజర్)ను ఎంఎంఆర్ ఏరియాలోని కేకే ఓసీ నుంచి ఆర్కేపీ ఓసీ మేనేజర్‌గా, సేరు మధుసూదన్ (అడిషనల్ మేనేజర్)ను శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ ఓసీ-2 నుంచి ఎంఎంఆర్ ఏరియాలోని కేకే ఓసీ మేనేజర్‌గా, జి. శ్రీధర్‌రావు (అడిషనల్ మేనేజర్)ను ఎస్ఆర్పీ ఓసీ-2 నుంచి శ్రీరాంపూర్ ఏరియా క్యూఎం విభాగానికి, మనోజ్ కుమార్ (అడిషనల్ మేనేజర్) ను భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ-3 నుంచి భూపాలపల్లి జీవీటీసీకి బదిలీ చేశారు. ఇక మెక్కొండ శ్రీనివాస్ (అడిషనల్ మేనేజర్)ను ఆర్జీ-2 ఏరియాలోని వీకేపీ (జీడీకే-9 ఇంక్) నుంచి ఆర్జీ-3 ఏరియాలోని ఆర్జీఓసీ-1కు, బైరి హనుమాన్ గౌడ్ (అడిషనల్ మేనేజర్)ను శ్రీరాంపూర్ ఏరియా ఎన్విరాన్‌మెంట్ సెల్ నుంచి అదే ఏరియాలోని ఎస్అండ్‌పీసీకి, మండల వీరారెడ్డి (అడిషనల్ మేనేజర్)ను ఆర్జీ-1 ఏరియా ఎస్అండ్‌పీసీ నుంచి భూపాలపల్లి ఏరియా ఎస్అండ్‌పీసీకి, సిల్వేరి మురళీమోహన్ (అడిషనల్ మేనేజర్)లను భూపాలపల్లి ఏరియా ఎస్అండ్‌పీసీ నుంచి ఆర్జీ-1 ఏరియా ఎస్అండ్‌పీసీకి బదిలీ చేశారు. గోలి రాజేష్ కుమార్ (డిప్యూటీ మేనేజర్)ను శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ ఓసీ-2 నుంచి కార్పొరేట్ ప్రాజెక్ట్ ప్లానింగ్ విభాగానికి, అన్నపురెడ్డి రవీందర్ (డిప్యూటీ మేనేజర్)ను ఆర్జీ-2 ఏరియాలోని వీకేపీ నుంచి ఆర్జీ-3 ఏరియాలోని ఆర్జీ ఓసీ-2కు, అచన అవినాష్ (డిప్యూటీ మేనేజర్)ను ఎస్పీఎల్ ఏరియాలోని కిస్టారం ఓసీ నుంచి కార్పొరేట్ ప్రాజెక్ట్ ప్లానింగ్ విభాగానికి, పుల్లూరి కార్తీక్ (డిప్యూటీ మేనేజర్)ను భూపాలపల్లి ఏరియా ఎస్టేట్స్ విభాగం నుంచి ఆర్జీ-3 ఏరియాలోని ఆర్జీ ఓసీ-2కు, ఒల్లాల దేవేందర్ (డిప్యూటీ మేనేజర్)ను ఆర్జీ-2 ఏరియాలోని వీకేపీ నుంచి ఆర్జీ-3 ఏరియాలోని ఆర్జీ ఓసీ-2కు బదిలీ చేశారు. అదేవిధంగా జి. ప్రశాంత్ జీవన్ (సూపర్‌వైజరీ ఇంజినీర్--ఎస్ఎంఎంసీ)ను ఆర్జీ-3 ఏరియాలోని ఆర్జీ ఓసీ-2 నుంచి ఆర్జీ-3 ఏరియా ఎన్విరాన్‌మెంట్ సెల్‌కు, అనంత్ సుమన్ (సూపర్‌వైజరీ ఇంజినీర్--ఎస్ఎంఎంసీ)ను ఆర్జీ-3 ఏరియా ఆర్జీ ఓసీ-2 నుంచి ఎంఎంఆర్ ఏరియా జీవీటీసీకి, నల్లి సతీష్ కుమార్ (సూపర్‌వైజరీ ఇంజినీర్--ఎస్ఎంఎంసీ)ను యెల్లందు ఏరియా ఎన్విరాన్‌మెంట్ సెల్ నుంచి యెల్లందు ఏరియాలోని కేఓసీ-2కు, కాపటపాటి వెంకటేశ్వరరావు (డిప్యూటీ సూపర్‌వైజరీ ఇంజినీర్--ఎస్ఎంఎంసీ) ను ఎస్పీఎల్ ఏరియాలోని జేవీఆర్ ఓసీ-2 నుంచి కొత్తగూడెం ఏరియాలోని వీకేసీఎంకు బదిలీ చేశారు. అసరి మురళీకృష్ణ యాదవ్ (సూపర్‌వైజరీ ఇంజినీర్--ఎస్ఎంఎంసీ)ను శ్రీరాంపూర్ ఏరియా క్యూఎం విభాగం నుంచి అదే ఏరియా ఎన్విరాన్‌మెంట్ సెల్‌కు, ఎం.డి. ముస్తఫా (డిప్యూటీ సూపర్‌వైజరీ ఇంజినీర్--ఎస్ఎంఎంసీ) ను ఆదిలాబాద్ ప్రాంతంలోని ఏఎల్‌పీ నుంచి ఆర్జీ-3 ఏరియాలోని ఆర్జీ ఓసీ-2కు, కొల్లూరి నరసింహారావు (డిప్యూటీ సూపర్‌వైజరీ ఇంజినీర్--ఎస్ఎంఎంసీ) ను యెల్లందు ఏరియాలోని కేఓసీ-2 నుంచి అదే ఏరియా ఎన్విరాన్‌మెంట్ సెల్‌కు బదిలీ చేశారు. షేక్ సమీద్ (సీనియర్ అండర్ మేనేజర్)ను మందమర్రి ఏరియాలోని కాసిపేట నుంచి ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-2, 2ఏకు, పెరుగు శరత్ కుమార్ (మేనేజ్‌మెంట్ ట్రైనీ--మైనింగ్)ను ఆదిలాబాద్ ప్రాంతంలోని ఏఎల్‌పీ నుంచి ఎంఎంఆర్ ఏరియాలోని కేకే-5కు, పగిడి విశ్వనాథ్ (మేనేజ్‌మెంట్ ట్రైనీ--మైనింగ్)ను ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-2 ఇంక్లైన్ నుంచి ఎంఎంఆర్ ఏరియాలోని కాసిపేట-1 ఇంక్లైన్‌కు, దొమ్మాటి ప్రశాంత్ (మేనేజ్‌మెంట్ ట్రైనీ--మైనింగ్) ను ఆదిలాబాద్ ప్రాంతంలోని ఏఎల్‌పీ నుంచి శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 ఇంక్లైన్‌కు బదిలీ చేశారు. ఒకేసారి 34 మంది మైనింగ్ అధికారుల బదిలీలు జరగడంతో సింగరేణి వివిధ ఏరియాలు, విభాగాల్లో అధికారుల బాధ్యతల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. దీర్ఘకాలంగా ఒకే స్థానంలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది అధికారులకు కూడా స్థానచలనం కల్పించడం ఈ బదిలీల్లో ప్రత్యేకతగా నిలిచింది. కొత్తగా బాధ్యతలు చేపట్టే అధికారులు వెంటనే విధుల్లో చేరి సంస్థ కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించాలని యాజమాన్యం ఆదేశించింది.

# ప్రమాదాలు సంస్థకు ఏమాత్రం శ్రేయస్కరం కాదు

## రక్షణతో కూడిన ఉత్పత్తి ద్వారానే సంస్థ అభ్యున్నతి

### శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి): ప్రమాదాలు సంస్థకు ఏమాత్రం శ్రేయస్కరం కాదని, రక్షణతో కూడిన ఉత్పత్తి ద్వారానే సంస్థ అభ్యున్నతి సాధ్యమవుతుందని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ఎక్స్‌ప్లోజివ్స్ వినియోగం, ప్రమాదాల నివారణకు సంబంధించి శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనుల ఏజెంట్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు, మేనేజర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ "ఉత్పత్తి కంటే రక్షణే ముఖ్యం.. రక్షణ లేని ఉత్పత్తి వ్యర్థం" అని స్పష్టం చేశారు. పని ప్రదేశాల్లో రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, రూఫ్‌ఫాల్, సైడ్‌ఫాల్, హాలేజ్ తదితర ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎక్స్‌ప్లోజివ్స్, ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ విషయంలో డీజీఎంఎస్ నుంచి ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. ఎక్స్‌ప్లోజివ్స్ వినియోగంలో గని మేనేజర్లు, సేఫ్టీ అధికారుల అప్రమత్తత అత్యంత అవసరమన్నారు. ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగంపై షాట్‌ఫైరర్లు, సర్దార్లు, సూపర్‌వైజర్లకు గనుల వారీగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మేనేజర్ తమ గనికి కేటాయించిన ఎక్స్‌ప్లోజివ్స్ నాణ్యతను పరిశీలించాలని, ఫాల్ట్ లేదా డ్యామేజ్ ఉన్న వాటిని గుర్తించి సంబంధిత సరఫరాదారులకు తిరిగి పంపాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ షాట్‌ఫైరర్లు, సర్దార్ల నుంచి నివేదికలు తీసుకోవాలని, ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల సరఫరాదారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ మిస్‌ఫైర్, నో బ్లాస్ట్ వంటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. సింగరేణిలో "జీరో హామ్" లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి ద్వారా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని జీఎం మునిగంటి శ్రీనివాస్ కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ సురేష్, ఏజీఎం (ఫైనాన్స్) శ్రీధర్, ఐకే ఓసీ పీఓ ఏ.వి. రెడ్డి, ఆర్కే గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, డీజీఎం (సేఫ్టీ) విజయ్ కుమార్, డీజీఎం (స్టోర్స్) మల్లయ్యతో పాటు అన్ని గనుల మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు



**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** వానాకాలం 2026--27 సీజన్‌కు సంబంధించి జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు చర్యలు చేపట్టి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వానాకాలం 2026--27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధిత ఏజెన్సీలతో ముందస్తు సమావేశాలు నిర్వహించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేయరాదని, ఎత్తైన ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చదునుగా ఉన్న అనుకూల ప్రదేశాలను ఎంపిక చేసి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు తరచుగా ఎదురయ్యే ప్రశ్నలు, సందేహాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు ముందుగానే అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలను ముందుగానే సమకూర్చాలని సూచించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ వి. రాములు ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదరికాన్ని గెలిచిన పట్టుదల ఎంబీబీఎస్‌కు ఎంపికైన ఆటో డ్రైవర్ కూతురు



**నేరడిగొండ, సెప్టెంబర్ 08(ప్రజాజ్యోతి):** తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నా.. కుమార్తె ఉన్నత చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా అండగా నిలిచాడు. తండ్రి కష్టానికి తన పట్టుదల, ప్రతిభను జోడించిన నేరడిగొండ మండలం బొందిడి గ్రామానికి చెందిన ఆడే వైష్ణవి నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ వైద్య విద్యకు ఎంపికైంది. బొందిడి గ్రామానికి చెందిన ఆడే జైపాల్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, తన కుమార్తె వైష్ణవిని ఉన్నత చదువులు చదివించాలనే సంకల్పంతో నిరంతరం ప్రోత్సహించారు. తండ్రి అందించిన సహకారంతో వైష్ణవి అహర్నిశలు కష్టపడి చదివి నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 1,90,000 ర్యాంక్, ఎస్టీ కేటగిరీలో 334వ ర్యాంక్ సాధించింది. ఈ ఉత్తమ ర్యాంక్ ఆధారంగా ఆమెకు నిర్మల్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు లభించింది. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతానికి చెందిన విద్యార్థిని పరిమిత వనరులతోనే ఉచిత ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా పట్టుదల, కృషి ఉంటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని వైష్ణవి నిరూపించింది. కుమార్తె చదువుకు అండగా నిలిచిన తండ్రి జైపాల్ ప్రోత్సాహం, వైష్ణవి పట్టుదల నేటి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# నత్తనడకన కుప్టి బ్రిడ్జి మరమ్మతులు.. అధికారుల తీరుపై లైవ్ అధ్యక్షుడు మండిపాటు!



**నేరడిగొండ, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** మండలం కుప్టి వద్ద కడెం వాగుపై ఉన్న పాత బ్రిడ్జి మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండటంపై జిల్లా లైవ్ అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం రోజుల క్రితం బ్రిడ్జికి బుంగ పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పాత బ్రిడ్జికి నామమాత్రపు మరమ్మతులు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని విమర్శించారు. కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర భయాందోళన నడుమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతున్నందున అధికారులు ఇప్పటికైనా తాత్కాలిక మరమ్మతులతో కాలయాపన చేయకుండా, పాత బ్రిడ్జి స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని కోరారు. శాశ్వత వంతెన నిర్మాణంతోనే ప్రయాణికుల భద్రతకు, సురక్షిత రాకపోకలకు మార్గం సుగమం అవుతుందని మహేందర్ జాదవ్ స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ కుటుంబ బీమా పథకానికి ఏర్పాట్లు

**అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి బీమా వర్తించేలా చర్యలు**




**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పథకం వర్తించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.06 కోట్ల కుటుంబాలకు త్వరలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా జిల్లాల వారీగా అవసరమైన విధివిధానాలను రూపొందించుకోవాలని సూచించారు. ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ కె.హరిత సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలు, ఆదేశాల మేరకు జిల్లాలో పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లు, విధివిధానాలను రూపొందిస్తామని ఆమె తెలిపారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఎంపీడీవో



**సోనాల, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి ):** సోనాల మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీవో రత్నాకర్ రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని గదులను, పరిసరాలను పరిశీలించిన ఆయన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, వారికి అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ అమలు మరియు తాగునీటి సౌకర్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ హాస్టల్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వసతి గృహ సంక్షేమాధికారి విజయ్ కుమార్ ని ఆదేశించారు. భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులు చదువులో రాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన చేస్తుంది.

**అసెంబ్లీ కి రానివ్వకుండా అడ్డుకోవడం సిగ్గు చేటు**

**మహిళా శాసనసభ్యులపై అనుచిత ప్రవర్తనకు నిరసనగా ధర్నా**



**ఖానాపూర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి ) :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రానివ్వకుండా పోలీసులతో అడ్డుకోవడంతో పాటు, మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా వ్యవహరించారని పేర్కొంటూ ధర్నా చేశారు. తెలంగాణ చౌక్ లో రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తూ ప్రజల గొంతుకగా నిలిచే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రజల సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గొంతును అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యం లో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు, ప్రజల సమస్యలను శాసనసభలో ప్రస్తావించే హక్కు ఉందని, ఆ హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం మంచిది కాదని అన్నారు. ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని, మహిళలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా వ్యవహరించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాథోడ్ రామునాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోయబ్, నాయకులు ఖలీల్, పుప్పాల గజేందర్, మహిపాల్, లింగన్న, చంద్రహాస్, మహిళా లు, మాజీ ప్రజా ప్రతినిధులు. మహిళలు. బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ మున్సిపాలిటీ 6వ వార్డ్ కు చెందిన ఇద్దరు మహిళలకు సి యం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఖానాపూర్ ఆగస్టు 8 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణ 6వ వార్డ్ కు చెందిన ఇద్దరు మైనారిటీ మహిళలకు ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ 6వ వార్డ్ మాజీ కౌన్సిలర్ అమానుల్లా ఖాన్ సిఫారస్ మేరకు ఒకరికి 20వేలు మరొకరికి 45వేలు మంజూరు చేయించారు ఈ చెక్కులను వార్డ్ మాజీ కౌన్సిలర్ అమానుల్లా ఖాన్ చేతుల మీదుగా అందజేశారు స్థానిక ఎమ్మెల్యేకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశారు

## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. పోలీసులకు బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు



**నేరడిగొండ, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఆయనకు హాని కలిగించేలా ప్రేరేపించే వ్యాఖ్యలు చేశారంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే కే. శంకరయ్యతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతరులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు మేరకు నేరడిగొండ మండల బీఆర్ఎస్ కన్వీనర్ అల్లూరి శివరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు (పిటిషన్) అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో ఉన్న నాయకులపై బాధ్యతారహితంగా, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సంబంధిత వ్యాఖ్యలను పరిశీలించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల బీఆర్ఎస్ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కన్నులు కదిలించే కాగితపు గణపతి విద్యార్థుల వినూత్న ప్రయోగం



**ఖానాపూర్, సెప్టెంబర్ 8 ( ప్రజా జ్యోతి )**నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కాగితపు గణపతి తయారు చేసి ఆకట్టుకుంటున్నారు. వినాయక చవితి పండుగ విద్యార్థులు వినూత్న ప్రతిభ కనబర్చి మంగళవారం కాగితపు గణపతిని ఆవిష్కరించారు. రసాయనాలతో కూడిన విగ్రహాలకు ప్రత్యామ్నాయంగా, పైసా ఖర్చు లేకుండా కేవలం కాగితంతో 'కన్నులు కదిలించే జీవకళా గణపతి'ని రూపొందించి ఔరా అనిపించారు. ?పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు వెన్నం అంజయ్య ప్రోత్సాహంతో 7వ తరగతి విద్యార్థులు జంజిరాల నందిత, మాలవత్ శ్రీచందన, భూమి శివాని, గడ్డం అరణ్య, ఐనవేణి నిహారిక, గాండ్ల రిషిత్, చట్పెల్లి వర్షిత్ తమ ఆలోచనలకు పదునుపెట్టి ఈ విశిష్ట గణపతులను తయారు చేశారు. ఎ4 సైజ్ పేపర్‌పై అందమైన వినాయకుడి చిత్రాన్ని తీర్చిదిద్ది, లోపలివైపు కన్నులను అమర్చారు. కింది భాగం నుంచి చేతివేలితో సున్నితంగా కదిలిస్తే వినాయకుడి కన్నులు అటూ ఇటూ కదులుతూ సాక్షాత్తు గణనాథుడే కళ్లముందు కదిలినట్లు కనిపించడం ప్రత్యేకత. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా, అతి తక్కువ ఖర్చుతో అందరూ సులువుగా ఈ విధమైన గణపతులను తయారు చేసుకోవచ్చని తెలిపారు. రాబోయే వినాయక చవితికి తాము స్వయంగా రూపొందించిన ఈ కాగితపు గణపతినే భక్తిశ్రద్ధలతో పూజించనున్నట్లు చెప్పారు. పర్యావరణ హిత ఆలోచనలతో సరికొత్త ప్రయోగం చేసిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు అంజయ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## పోడు రైతుల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**అటవీశాఖ ప్రధాన అధికారి వినయ్‌కుమార్‌కు**

**అజ్మీరా శ్యామ్ నాయక్ వినతి**



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** పోడు రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సరఫరా, పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ కోరారు. ఈ మేరకు అటవీశాఖ ప్రధాన అటవీ సంరక్షణ అధికారి వినయ్‌కుమార్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించారు. పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు వారి భూముల హక్కులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాబురావు పాల్గొన్నారు. పోడు రైతుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని శ్యామ్ నాయక్ తెలిపారు.

## దుర అహంకార మదంతో స్పీకర్ ని అవమానపరిచిన ఎమ్మెల్సీ తాత మదును వెంటనే పదవినుంచి తొలగించాలి

**ఖానాపూర్ లో కాంగ్రెస్ సేవలో నిరసన లో డిమాండ్**



**ఖానాపూర్ సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి)** అసెంబ్లీ స్పీకర్ పై సమాజం తలదించుకునేలా వాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధును వెంటనే బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్ ఆధ్వర్యంలో ఖానాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ చౌక్ వద్ద ధర్నా రాస్తారోకో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగిలి శంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అంటేనే దళిత వ్యతిరేక పార్టీ అని అన్నారు. దళితులు ఉన్నత పదవుల్లో ఉంటే దొరల కండ్లు మండుతున్నాయన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ని ఉద్దేశించి ఎమ్మెల్సీ తాత మధు చేసిన వాఖ్యలు తెలంగాణ సమాజానికి సిగ్గు చేటన్నారు. కేటీఆర్ హరీష్ రావు కౌశిక్ రెడ్డి వీధి రౌడీల్లాగా ప్రవర్తించడం సరికాదన్నారు అసెంబ్లీకి రాణి ప్రతి పక్ష నాయకుడు కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనా మా చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు రాజూరా సత్యం డిసిసి అధికార ప్రతినిధి దొనికేని దయానంద్ డిసిసి కార్యదర్శి అంకం రాజేందర్ పిఏసిఎస్ చైర్మన్ అమంద శ్రీని వాస్ ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజు నాయక్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ సర్పంచులు పోలంపల్లి సచిన్ ప్రశాంత్ రెడ్డి గోపి నాయక్ చింతల మల్లేష్ శంకర్ సిద్ధ నరేష్ మండల పార్టీ ఉపాధ్యక్షులు దొనికేని సాగర్ ప్రధాన కార్యదర్శి కుడిమాల వీరేష్ రఘుపతి రెడ్డి గుడాల రాజన్న సంగర్తి రాజన్న అశోక్ షబ్బీర్ పా షా కదార్ల గంగానర్సయ్య ధ్యావతి రాజేశ్వర్ అమనుల్లా జహీర్ మధిరే సత్యానారాయణ మడిగల గంగాధర్ మహిళ నాయకులు సుజాత రమాదేవి మండల పట్టణ నాయకులు ఉపసర్పంచులు గ్రామ కమిటీ అధ్యక్షులు నాయకులు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు

## రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి

**అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు అందేలా చర్యలు**

**జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 8,( ప్రజాజ్యోతి ).**జిల్లా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బ్యాంకర్లను ఆదేశించారు. అర్హులైన రైతులు, విద్యార్థులు, యువత, మహిళా స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులకు రుణాలు సకాలంలో అందేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో 2026--27 వార్షిక రుణ ప్రణాళిక, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరు, ప్రాధాన్యతా రంగాలకు ఆర్థిక సహాయం, సామాజిక భద్రతా పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు.2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని బ్యాంకులకు రూ.7,952.87 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు రూ.2,331.18 కోట్లు (29.31 శాతం) సాధించి నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రాధాన్యతా రంగాలకు నిర్దేశించిన రూ.6,661.73 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,847.71 కోట్లు (27.74 శాతం) సాధించారని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.విద్యా రుణాల మంజూరు తక్కువగా ఉందని పేర్కొన్న కలెక్టర్, అర్హులైన విద్యార్థులకు అధిక సంఖ్యలో రుణాలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో బ్యాంకు ఖాతాలు లేని ప్రతి ఒక్కరికీ సెప్టెంబర్‌లోగా ఖాతాలు తెరవాలని సూచించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, కాస్మోటిక్ ఛార్జీల జమ కోసం లక్ష్యంగా పెట్టుకున్న 3,500 ఖాతాల్లో ఇప్పటికే 1,022 కొత్త ఖాతాలు ప్రారంభించినట్లు తెలిపారు.పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ తదితర పథకాల అమలును కలెక్టర్ సమీక్షించారు. రుణ లక్ష్యాల సాధనకు జిల్లా పరిశ్రమల శాఖ బ్యాంకర్లతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ, పీఎం స్వనిధి రుణాల్లో ఎన్‌పీఏలను తగ్గించేందుకు మున్సిపల్ కమిష నర్లతో సమావేశాలు నిర్వహించాలని ఎల్‌డీఎంను సూచించారు. మొండి బకాయిల వసూళ్లకు సీబీఆర్ఎం బృందాల సేవలను వినియోగించుకోవాలని, అన్ని బ్యాంకులను సమన్వయం చేస్తూ మెరుగైన పనితీరు సాధించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయడంతోపాటు డిజిటల్ ఎంసీపీ సమస్యలను పరిష్కరించాలని పీడీ డీఆర్డీఏకు సూచించారు.విజయ డెయిరీతో టైఅప్ ద్వారా రైతులకు పాడి పశువుల కొనుగోలుకు రుణాలు అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. పాడి పశువులకు అవసరమైన ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని జిల్లా పశువైద్యాధికారిని ఆదేశించారు. డెయిరీ యూనిట్లకు బ్యాంకులు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని కోరారు. రైస్ మిల్లుల ఫైనాన్స్‌కు అవసరమైన ఎన్ఓసీలు, బ్యాంకు గ్యారెంటీల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలు బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై వంటి సామాజిక భద్రతా పథకాల కింద మరణించిన లబ్ధిదారుల కుటుంబాలకు అందిన క్లెయిమ్‌ల ను విజయగాథలుగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం జిల్లాలోని క్రెడిట్ పోర్ట్‌ఫోలియోపై ఎలా ఉండొచ్చో అంచనా వేసి నివేదిక అందించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం బి. రామ్‌గోపాల్, ఆర్‌బీఐ ఏజీఎం, ఎల్‌బీఓ ఎస్. రాములు, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మి, ఆర్ఎం నవీన్ పురం, సీఎం క్రెడిట్ ఆర్‌బీఓ ఆదిలాబాద్ పీయూష్, వివిధ బ్యాంకుల అధికారులు, నాబార్డ్, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


## కోట ( కే ) లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**సోనాల, సెప్టెంబర్ 08 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండలంలోని కోట( కే ) గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతు న్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని ఎంపీడీవో రత్నాకర్ రావు పరిశీలించారు. మంగళవారం రోజున గ్రామంలో నిర్మాణంలో ఉన్న పలు ఇళ్లను క్షేత్రస్థాయిలో సందర్శించి, పనుల నాణ్యతను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అర్హులైన పేదలకు సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజ సంగ్రామ్ , గ్రామ కార్యదర్శి విజయ్ కుమార్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

## స్వర్ణగిరిలో నిర్మల్ చిన్నారికి అరుదైన గౌరవం

**కూచిపూడి నాట్యంలో ప్రతిభకు 'స్వర్ణగిరి బాలాజీ అవార్డు**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 8 ,( ప్రజాజ్యోతి )**యాదాద్రి జిల్లా స్వర్ణగిరి ప్రసిద్ధ శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య కళా పోటీల్లో నిర్మల్‌కు చెందిన చిన్నారి గుర్రం సంహిత కూచిపూడి నాట్యంలో అద్భుత ప్రతిభ కనబరిచి 'స్వర్ణగిరి బాలాజీ అవార్డు' అందుకుంది. నిర్మల్ పట్టణానికి చెందిన గుర్రం మహిత, ప్రణయ్ దంపతుల కుమార్తె సంహితకు ఈ అరుదైన గౌరవం దక్కడం పట్ల కుటుంబ సభ్యులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. కేవలం ఐదేళ్ల వయసులోనే కూచిపూడి నాట్యంపై ఆసక్తి పెంచుకున్న సంహిత.. భక్తి భావాన్ని ప్రతిబింబించేలా హావభావాలు, అభిన యంతో నృత్యాన్ని ప్రదర్శించింది. ఆమె ప్రదర్శనకు కళాక్షేత్రం లో హాజరైన సభికులు చప్పట్లతో అభినందించారు. చిన్నారి ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకోవడంతో నిర్వాహకులు ఆమెను అవార్డుతో సత్కరించారు. చిన్న వయసులోనే నృత్యరంగంలో ప్రతిభను చాటుతూ రాష్ట్రస్థాయి వేదికపై అవార్డు అందుకోవడం పలువురు అభినందించారు. భరతనాట్యంతో పాటు భారతీయ కళలు, సంస్కృతిపై చిన్నారికి మరింత ఆసక్తి పెంచేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. సంహితకు పలువురు కళాకారులు, ప్రముఖులు, బంధుమిత్రులు అభినందనలు తెలియజేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**సోనాల, సెప్టెంబర్ 08 ( ప్రజా జ్యోతి ):** సోనాల మండల కేంద్రా నికి చెందిన మంద చందన అనే ప్రైవేటు ఉపాధ్యాయురాలు బోథ్ మండలంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. అదిలాబాద్ లోని ఎస్టీయూ భవన్ లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహజన్, మున్సిపల్ చైర్ పర్సన్ అనూషలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ దీపక్, ప్రిన్సిపల్ స్మిత, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ఆమెను అభినందించారు.

## భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 8, (ప్రజా జ్యోతి )** విమానాశ్రయం నిర్మాణ ప్రక్రియలో భాగంగా అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను అత్యంత వేగవంతం చేయాల ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో విమానాశ్రయం నిర్మాణ ప్రక్రియపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ప్రక్రియ, విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులకు సంబంధించిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ ప్రక్రి యను తక్షణమే పూర్తి చే యాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా రైతులు, గ్రామస్తులతో మాట్లాడి, భూసేకరణకు సంబంధించి రేట్ల ను ఫైనలైజ్ చేసి తదుపరి ప్రక్రియను ముందుకు తీసు కెళ్లాలని సూచించారు.ఆ యా సర్వే నంబర్లకు సంబంధించిన పెండింగ్ దస్తావేజులను త్వరి తగతిన పరిష్కరించి, అవసరమైన అదనపు ఎక్స్‌పెన్షన్ ప్రపోజల్స్ ప్ర భుత్వానికి పంపాలని అధి కారులను ఆదేశించారు. రెవెన్యూ, సర్వే, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్. ఎస్. చిత్రూ, ఎస్. రాజేశ్వర్, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, ఆర్డీవో జ గదీశ్వ ర్ రావు, భూ సర్వే కొలతల శాఖ ఏడి ప్రభాకర్, వివిధ శా ఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులనే పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 8 ,( ప్రజాజ్యోతి ).**వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తూ, జలవనరులను కాలుష్యం నుంచి కాపాడాలని సూచించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఆధ్వర్యంలో, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సమన్వయంతో రూపొందించిన పర్యావరణ పరిరక్షణ, మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన పోస్టర్లను మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను జలవనరుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి నాణ్యత దెబ్బతినడంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ముఖ్యంగా పీవోపీ విగ్రహాలు సులభంగా కరగకపోవడం వల్ల చెరువులు, నదులు, ఇతర జలవనరుల్లో కాలుష్యం పెరిగే అవకాశం ఉందన్నారు. రసాయన రంగుల్లోని హానికర పదార్థాలు నీటిలో కలవడం వల్ల జలచరాల మనుగడకు ముప్పు ఏర్పడటంతో పాటు, ఆ నీటిని వినియోగించే ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల పర్యావరణానికి హాని కలగకుండా సంప్రదాయబద్ధంగా మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగించి పూజించాలని సూచించారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, రద్దీ ప్రాంతాల్లో అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భక్తి భావంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణహితంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ డాక్టర్ బి. తిరుపతి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భార్యను హత్య చేసి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ

**భర్తకు జీవిత ఖైదు.. రూ.15 వేల జరిమానా**

**సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేసిన పోలీసులు**



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** భార్యను రాయితో కొట్టి హత్య చేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన భర్తకు ఆసిఫాబాద్ జిల్లా మరియు సెషన్స్ కోర్టు జీవిత ఖైదు, రూ.15 వేల జరిమానా విధించింది. వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 మార్చి 3న జరిగిన ఈ ఘటనపై పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా చేశారు. వాంకిడి మండలం చిచ్చుపల్లి గ్రామానికి చెందిన తోడసం శ్యాంరావు (25) తన భార్య తోడసం సంధ్యారాణితో కలిసి 2023 మార్చి 3న రాత్రి బంబారా గ్రామ శివారులో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో సంధ్యారాణి మొబైల్ ఫోన్ రోడ్డుపై పడిపోవడంతో దానిని తీసుకునేందుకు కిందకు దిగింది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆమె మృతి చెందినట్లు శ్యాంరావు పోలీసులను నమ్మించాడు. దీంతో తొలుత వాంకిడి పోలీసులు 21/2023 కింద 304 సెక్షన్‌తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే మృతురాలి తండ్రికి అందిన సమాచారం ఆధారంగా పోలీసులకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. శ్యాంరావు తన భార్యను రాయితో కొట్టి హత్య చేసి, ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లు దర్యాప్తులో తేలింది. భార్యపై అనుమానంతో తరచూ గొడవపడే శ్యాంరావు.. ఘటన జరిగిన రోజు ఆమెను రోడ్డు పక్కకు లాగి రాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందినట్లు నమ్మించేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించారు.

**రక్తపు మరకలున్న రాయి స్వాధీనం**

కేసు దర్యాప్తులో భాగంగా సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి సమాచారం మేరకు రక్తపు మరకలు ఉన్న రాయి, రక్తపు మరకలు కలిగిన మట్టిని స్వాధీనం చేసుకున్నారు. వైద్య, ఫోరెన్సిక్, శాస్త్రీయ ఆధారాలను సేకరించి నిందితుడిపై 302, 201 సెక్షన్ల కింద చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

**సాక్ష్యాలతో నేరం రుజువు**

ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాలు, వైద్య, ఫోరెన్సిక్ ఆధారాలు, ఇతర దర్యాప్తు వివరాలను పరిశీలించిన ఆసిఫాబాద్ జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి బి. శారదాదేవి నిందితుడు శ్యాంరావు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించారు. దీంతో అతడికి జీవిత ఖైదుతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జగన్మోహన్‌రావు, ఎం. శ్రీనివాస్‌రావు ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతంగా వాదనలు వినిపించారు.

**పోలీసులకు ఎస్పీ అభినందనలు**

కేసులో సాక్ష్యాధారాలను సమర్థవంతంగా సేకరించి దర్యాప్తు పూర్తి చేసిన వాంకిడి పోలీస్ స్టేషన్ దర్యాప్తు అధికారి బి. శ్రీనివాస్, ప్రస్తుత డీఎస్పీ అశోక్, సీఐ ఎస్. వేణుగోపాల్, ఎస్సై డి. మహేందర్, లైజనింగ్ ఆఫీసర్ కె. బాల్‌సింగ్, సబ్ డివిజన్ సీడీఓ రాంసింగ్‌తో పాటు సాక్షులను సమన్వయం చేసి కోర్టులో సకాలంలో హాజరుపరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ నితికా పంత్ అభినందించారు. నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. ఇదే వార్తకు దిశ పత్రికలో వచ్చేలా మరింత క్రైమ్ పంచ్ ఉన్న 5 హెడ్‌లైన్లు కూడా కావాలంటే తయారు చేస్తాను.

## గ్రామపంచాయతీలో పరిశుద్ధ పనులు



**ఖానాపూర్ సెప్టెంబర్ 8( ప్రజా జ్యోతి )**ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ గ్రామంలో పారిశుధ్య పనులను సర్పంచ్ బండారి పుష్ప ఆద్వర్యంలో పారిశుధ్య సిబ్బంది చేత గ్రామంలోని ప్రతీ వీధి డ్రెయినేజీల పక్కన గడ్డి,పిచ్చి మొక్కలకి కలుపుమందు (గడ్డిమం దు) పిచికారీ చేయించారు. వర్షాకాలంలో పారిశుధ్య పనులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. దోమల నివారణకు దోమల మందు పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారుసర్పంచ్ బండారి పుష్ప పంచాయతీ కార్యదర్శి గంగాధర్, కారోబార్ రాజు, నాయకులు ఫకీర్ సింగ్, రవీందర్,వంశీ కుమార్,గ్రామస్థులు ప్రకాష్,శంకర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పసిడి బాల్యం.. ఆటపాట లతో అభ్యాసనం


**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 8, (ప్రజా జ్యోతి** పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ, అభ్యసనాన్ని ఆనందభరితంగా మార్చేం దుకు ప్రత్యేక చర్యలు చేప డుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లా లో నూతనంగా ప్రారంభించి న 74 ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో ఆటపాటల ద్వారా విద్యాబోధన అందించేలా వినూత్న అభ్యసన సామగ్రిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. మంగ ళ వారం మావల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రీ-ప్రైమరీ పాఠశాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సం దర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇండోర్, అవుట్ డోర్ ఆట వస్తువులు, డ్యాన్స్, పాటల కోసం మైక్ సెట్లు, ఊయలలతో పాటు చిన్నారులను ఆకట్టుకునేలా రూపొందించిన అభ్యాసన సామగ్రిని పరిశీలించారు. వీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ బోధనను మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం చిన్నారులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లను కలెక్టర్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ కాంత్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్, జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, పీఎంఓ మానిటరింగ్ అధికారి లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి








**రోజుకు 3 లక్షల మంది భక్తులకు సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక**

**బాసర మాస్టర్‌ప్లాన్ పనులను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 8 ,( ప్రజాజ్యోతి ).** రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని బాసరతో పాటు జిల్లాలోని అన్ని పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా రోజుకు సుమారు 2.5 నుంచి 3 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి గోదావరి పుష్కరాల నిర్వహణ, బాసర నూతన ఆలయ నిర్మాణం, మాస్టర్‌ప్లాన్, ఇరిగేషన్ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాసర మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా సుమారు రూ.354 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులకు 30 నెలల కాంట్రాక్టు వ్యవధి ఉన్నప్పటికీ, పుష్కరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అత్యవసర, కీలక పనులను ఎనిమిది నెలల్లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన పరిష్కరించి, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, పార్కింగ్, రవాణా తదితర మౌలిక వసతులను అవసరమైన స్థాయిలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రోజుకు మూడు లక్షల మంది భక్తులకు సరిపడేలా తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, బ్యాకప్ సదుపాయాలపై విద్యుత్ శాఖ అధికారులు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటు, వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు, అవసరమైన చోట వన్‌వే, డైవర్షన్ తదితర అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. బాసరతో పాటు జిల్లాలోని అన్ని పుష్కర ఘాట్ల వద్ద అత్యవసర వైద్య సేవలతో కూడిన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్స్‌లను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. పుష్కరాల సమయంలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య ఏర్పాట్లను పటిష్ఠం చేయడంతో పాటు, పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాలు, చెత్త తరలింపు తదితర అంశాలపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. డీపీఓ, డీఎంహెచ్‌ఓలు పరస్పర సమన్వయంతో పనిచేసి పారిశుద్ధ్యం, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశాల మేరకు బాసరలోని అక్రమ, అనధికార నిర్మాణాలను గుర్తించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో నిర్మాణాల తొలగింపు, భూసేకరణ తదితర ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. 24 గంటలపాటు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టి, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తామని తెలిపారు. భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలు, పార్కింగ్ తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడతామని చెప్పారు. బాసర నూతన ఆలయ నిర్మాణ పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆలయ నిర్మాణ పనులకు సంబంధించిన ప్రస్తుత స్థితి, ప్రతిపాదిత పనులు, భూసేకరణ, ఇరిగేషన్ తదితర అంశాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, పుష్కరాలకు వచ్చే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఈఈలు అనిల్, సుభాష్, సందీప్, బాసర ఆలయ ఈఓ అంజనా దేవి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాసిరెడ్డి సీతారామయ్య

**రాష్ట్ర కార్యదర్శిగా మేకల దాసు**

**ఏకగ్రీవ ఎన్నిక**

**మంచిర్యాల, 8,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కరీంనగర్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వాసిరెడ్డి సీతారామయ్య, మేకల దాసు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. కార్మిక వర్గ ఐక్యతను బలోపేతం చేస్తూ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, కార్మికుల హక్కులను హరించే చర్యలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నందున వాటిని ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తోందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు సామాజిక భద్రత, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పెన్షన్ తదితర హక్కులు కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను ఐక్యం చేసి, కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిర్వహిస్తున్న పోరాటాలను మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్ ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని వాసిరెడ్డి సీతారామయ్య, మేకల దాసు తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వానికి, మహాసభల ప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని కార్మిక వర్గం అప్పగించిన బాధ్యతగా భావించి, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరింత చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు.



# నష్టపరిహారం ఇవ్వకుండా అర్ధరాత్రి ఆస్తుల కూల్చివేత

## అధికారుల అండతోనే కాంట్రాక్టర్ దౌర్జన్యం

## కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి ఆస్తులు ధ్వంసం చేశారంటూ బాధితుల ఆరోపణ

**మంచిర్యాల, 8, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):**తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండానే అర్ధరాత్రి సమయంలో జేసీబీలతో తమ ఇల్లు, ఆస్తులను కూల్చివేసి తీవ్రంగా నష్టం కలిగించారని బాధితులు చెలగాని బొడ్డయ్య, సీహెచ్ సుదర్శన్ ఆరోపించారు. అధికారుల అండతోనే కాంట్రాక్టర్ ఈ దౌర్జన్యానికి పాల్పడ్డారని వారు పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 4న అర్ధరాత్రి సమయంలో మాదవ్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన కాంట్రాక్టర్ జేసీబీలతో తమ ఇంటి వద్దకు వచ్చి రోడ్డు పక్కన ఉన్న ఆస్తులు, ఇటుకలు, ఇతర నిర్మాణ సామగ్రిని ధ్వంసం చేశారని తెలిపారు. సీతారాంపల్లి వెళ్లే రహదారి గతంలో 40 అడుగుల వెడల్పు ఉండగా, ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ అధికారులు 60 నుంచి 70 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపడుతున్నారని తెలిపారు. రోడ్డు విస్తరణలో తాము కోల్పోయే భూమికి నష్టపరిహారం చెల్లించే వరకు పనులు నిలిపివేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించామని చెప్పారు. బాధితులకు నష్టపరిహారం, ఆస్తుల విషయంలో



పరిష్కారం జరిగే వరకు తమ ఆస్తులను తొలగించరాదని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా తమ ఆస్తులను తొలగించబోమని ధృవీకరణ పత్రం ఇచ్చారని తెలిపారు. రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, అయితే రోడ్డు కోసం తాము కోల్పోతున్న భూమికి న్యాయబద్ధమైన నష్టపరిహారం చెల్లించాలని మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌కు కూడా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో సుమారు 6 గుంటల ఇంటి స్థలాన్ని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే అకస్మాత్తుగా కమిషనర్ ఆదేశాలంటూ కాంట్రాక్టర్ జేసీబీలతో అర్ధరాత్రి సమయంలో తమ ఆస్తులను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఎస్‌ఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారని తెలిపారు. ఎంతగా బతిమిలాడినా కూల్చివేతలను ఆపలేదని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రజల ఆస్తులను పోలీసుల పహారాలో అధికారులు, కాంట్రాక్టర్లు దౌర్జన్యంగా ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బాధితులు అన్నారు. తమకు జరిగిన అన్యాయంపై కాంట్రాక్టర్‌తో పాటు అందుకు సహకరించిన కమిషనర్‌పై కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. అలాగే సీపీ, డీసీపీ, ఏసీపీలకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి కూల్చివేతకు పాల్పడ్డ కాంట్రాక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు.

# వినాయక మండపాలు, నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

## అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా

## ముందస్తు చర్యలు చేపట్టాలి: కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 8 ప్రజా జ్యోతి** వినాయక చవితి సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసే వినాయక మండపాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట బందోబస్తు, అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో వినాయక మండపాలు, నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిమజ్జన ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మండపాల వద్ద భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, అగ్నిమాపక, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల పరిధిలో నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను అందుబాటులో ఉంచాలని అధి



కారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు మండపాలు, నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ భద్రతా చర్యలు చేపట్టాలని, మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని, మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అగ్నిమాపక, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తమ పరిధిలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరిగేలా అన్ని



శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించి నిబంధనలు పాటిస్తూ వినాయక నిమజ్జన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమీక్షా సమావేశంలో ఎస్పీ నితిక పంత్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మట్, ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జోస్తిన్ జోల్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు అశోక్, వహీదొద్దీన్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఉత్తమ్ ఝూడే, డీపీఓ బిక్షపతి, డీఎంహెచ్ఓ నాగేంద్ర, మున్సిపల్ కమిషనర్లు తిరుపతి, అంజయ్య, తహసీల్దార్లు మధుకర్, రియాజ్ అలీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ కు చేరుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 8, ( ప్రజా జ్యోతి )** తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి జిల్లా పర్యటన నిమిత్తం స్థానిక పెను గంగ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా పుష్ప గుచ్ఛం అందించి సాదర స్వా గతం పలికారు. జిల్లా పర్య టనలో భాగంగా సీఈఓ సు దర్శన్ రెడ్డి ఎన్నికల సన్నా హకాలు, ఓటర్ల జాబితా ప్ర త్యేక



సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల ఏ ర్పాటు, ఈవీఎంల భద్రత, ఇతర ఎన్నికల నిర్వహణ అంశాలపై



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వ హించనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయమైన హక్కుల సాధన కోసం 10న 'చలో హైదరాబాద్'

**ఉద్యోగ, ఉపాధ్యాయ,అ ధ్యాపక వర్గాలు పెద్ద సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలి**

**తెలంగాణ గెజిటెడ్ జూని యర్ లెక్చరర్స్ అసోసియే షన్ (టిజిజెఎల్ఏ-475) ఆ దిలాబాద్ జిల్లా అధ్యక్షులు చట్ల ప్రవీణ్ కుమార్**




**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 8, (ప్రజా జ్యోతి )**తెలంగాణ రాష్ట్రంలోని ఉ ద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమై న, చట్టబద్ధమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల10 న నిర్వహించనున్న 'చలో హై దరాబాద్' కార్యక్రమాన్ని వి జయవంతం చేయాలని తె లంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (టి జీఎల్ఏ-475) ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు చట్ల ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔ ట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ స్యల పరిష్కారం కోసం అనే క సందర్భాల్లో ప్రజాస్వామ్య బద్ధంగా ప్రభుత్వ దృష్టికి తీ సుకెళ్లినప్పటికీ, అనేక కీలక మైన సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదని అన్నారు.రాష్ట్రంలోని అతిపెద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, పెన్షనర్ సంఘాల సమాఖ్య అయిన టి జి ఈ జెఏసి ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం అనేక దశల్లో ప్రభుత్వం దృ ష్టికి వినతులు, కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపా రు.ప్రభుత్వం కొన్ని చిన్న చిన్న సమస్యలను పరిష్కరి స్తున్నప్పటికీ, ఉద్యోగుల భ విష్యత్తుకు సంబంధించిన అనేక ముఖ్యమైన సమస్య లపై జాప్యం కొనసాగడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు.

**ఏకాభిప్రాయంతో 'చలో హైదరాబాద్'**

ఈ నేపథ్యంలో అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక సంఘాలు ఏకాభిప్రా యంతో ఈ నెల 10న 'చలో హైదరాబాద్' కార్యక్రమా నికి పిలుపునిచ్చాయని చట్ల ప్ర వీణ్ కుమార్ తెలిపారు.ఉ ద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ న్యాయమైన హక్కుల కోసం జరిగే ఈ ప్రజాస్వామ్య ఉద్యమంలో భారీ సంఖ్య లో పాల్గొని తమ ఐక్యతను చాటాలని ఆయన కోరారు.

**ఎన్నికల హామీలను అమలు చేయాలి**

ప్రభుత్వం ఎన్నికల సమ యంలో ఉద్యోగులు, ఉపా ధ్యాయులు వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఉద్యోగు ల సమస్యలను మరింత జటిలం చేయకుండా, చర్చ లు, పరస్పర అవగాహన ద్వారా సమస్యలను పరి ష్కరించి ఉద్యోగుల పట్ల స్నేహపూర్వక ప్రభుత్వంగా వ్యవహరించా లని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.హక్కులు అడగడం ఉద్యోగుల తప్పు కాదు... చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా రావాల్సిన హక్కులను సాధించుకోవడం ప్రతి ఉద్యోగి హక్కు, ఐక్యతతో, ప్రజాస్వామ్య పద్ధతిలో మన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 10న నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్ర మాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలి" అని చట్ల ప్రవీణ్ కుమార్ పిలు పునిచ్చారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాప కులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ ఈ కార్యక్ర మంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

**కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు**

'చలో హైదరాబాద్' కార్య క్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, అధ్యాప కులు, అసోసియేషన్ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని టిజిఎల్ఏ -475 ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు చట్ల ప్రవీణ్ కుమార్ కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చొక్కాల రాజేందర్, వర్కింగ్ ప్రెసి డెంట్ డాక్టర్ కొండ గోవర్ధన్, ట్రెజరర్ గుండ్రెడ్డి రాజేశ్వర్, అసోసియేట్ ప్రెసిడెంట్ పాముల సోమన్న, మహిళా కార్యదర్శి చందన్వార్ మాధవి జిల్లా ముఖ్య నాయకులు నల్ల ప్రభాకర్ రెడ్డి గుట్టె బాలాజీ భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొని 'చలో హైద రాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలు పునిచ్చారు.

## ప్రతిపక్షం పట్ల కక్షపూరితంగా,ద్వేషపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పాలకులు

**ఎంపీ వద్దిరాజు** కాంగ్రెస్ పాలకులు ప్రధాన ప్రతిపక్షం పట్ల కక్షపూరితంగా,ద్వేషపూరితంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర నిశితంగా విమర్శించారు.ప్రతి చిన్న విషయంలో సర్కార్ అతిగా స్పందిస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తూ అరెస్టులు చేసి వేధింపులకు పాల్పడుతున్నదన్నారు.ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు అరెస్టు అయిన విషయం తెలిసిన వెంటనే ఎంపీ రవిచంద్ర నారాయణ గూడ పోలీస్ స్టేషన్ కు వెళ్లి వారిని పరామర్శించి తన సంఘీభావం తెలిపారు.ఎమ్మెల్సీలను కింగ్ కోఠి ఆస్పత్రి,లక్డీకాపూల్ లోని మేజిస్ట్రేట్ నివాసం వద్దకు,అటునుంచి నాంపల్లి న్యాయస్థానానికి తీసుకెళ్లిన సందర్భాల్లో ఎంపీ రవిచంద్ర వారితో పాటు ఉన్నారు.ఈ సందర్భాల్లో ఎంపీ వద్దిరాజును మీడియా ప్రతినిధులు చుట్టుముట్టగా మాట్లాడుతూ ప్రభుత్వ దమననీతిని ఎండగట్టారు.ప్రజలకిచ్చిన 420 హామీలు,6 గ్యారంటీలు,13 డిక్లరేషన్ల అమలును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోకుండా "డైవర్షన్ పాలిటిక్స్"చేస్తున్నారని మండిపడ్డారు.అసెంబ్లీ సమావేశాలలో బీఆర్ఎస్ లేవనెత్తే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకునేందుకే రేవంత్ రెడ్డి ఒక పథకం ప్రకారం దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ పాలన కాదని,పోలీస్ రాజ్యం అని,వారిని అడ్డుపెట్టుకుని రేవంత్ రెడ్డి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు.కౌన్సిల్ చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ అనుమతి తీసుకోకుండానే తెల్లవారుజామునే ఎమ్మెల్సీల ఇళ్లపైకి పోలీసులు వెళ్లి, దొంగలు, దోపిడీదారుల వెంటబడి అరెస్టు చేయడం అక్రమం,అన్యాయం, దుర్మార్గం అన్నారు.సబితా ఇంద్రారెడ్డి,సునీతా లక్ష్మారెడ్డిల పట్ల అనుచితంగా ప్రవర్తించిన మగ పోలీసులపై కూడా కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్ రావుల ఇళ్ల వద్ద పోలీసులు మోహరించి ఉండడం తీవ్ర అభ్యంతరకరం అని ఎంపీ అన్నారు.ప్రధాన ప్రతిపక్షం పట్ల పాలకులు అవలంభిస్తున్న తీరును ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని, ఇకనుంచి ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ఎంపీ వద్దిరాజు ధీమాగా చెప్పారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం

గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ వరకు పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలపై సమగ్ర చర్చ

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం

**విజయవాడ** విజయవాడ డివి మేనర్ హోటల్ వేదికగా టీడీపీ జిల్లా పార్టీ ఎన్నికల సమావేశం జరిగింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. పార్లమెంటరీ పార్టీ ఎలక్షన్ ఇంచార్జ్ మక్కెన మల్లికార్జునరావు, జిల్లా పార్టీ అధ్యక్షులు గద్దె అనురాధ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ బుద్దా వెంకన్నతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమావేశంలో పాల్గొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలు, కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన కార్యాచరణపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ఎన్నికల ప్రక్రియను పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్ణయించారు.

## దామరకుంట దగ్గర ఉద్రిక్తత

**సిద్దిపేట** మంగళవారం నాడు దామరకుంట దగ్గర ఉద్రిక్తత నెలకొంది. కేసీఆర్ ఫామ్హౌస్కు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్పై బీఆర్ఎస్ నాయకుల రాళ్ల దాడి ఉద్రిక్తత కు దారి తీసింది. ఇరు వర్గాల మధ్య తోపులాట, తీవ్ర ఘర్షణ జరిగింది.

## పోలవరంలో విషాదం

**భర్త కళ్లెదుటే బైక్‌పై నుంచి పడి భార్య మృతి**

**ఏలూరు** : పోలవరం పాతూరు వద్ద దారుణ ఘటన చోటుచేసుకుంది. ద్విచక్రవాహనంపై భర్తతో కలిసి వెళు తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్ర గాయాలవ్వడంతో భార్య లక్ష్మి (38) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.కళ్లెదుటే భార్య మృతి చెందడంతో భర్త, కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## వంట గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు

**హైదరాబాద్** వంటగ్యాస్ బుకింగ్ గడువును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది గ్రామీణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్ గడువును 45 రోజుల నుంచి 25 రోజులకు తగ్గిస్తున్నట్లు కేంద్రమంత్రి సురేశ్ గోపీ వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఎల్పీజీ సరఫరాపై పడిన ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని గతంలో దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్ బుకింగ్ నిబంధనల్లో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పు చేసింది. ఆ మార్పుల ప్రకారం రీఫిల్ బుకింగ్ మధ్య గడువు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులుగా నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఎల్పీజీ సరఫరా పరిస్థితులు మెరుగుపడటంతో పాటు రీఫిల్ పెండింగ్ బాకీలు బ్యాక్లాగ్ కూడా గణియంగా తగ్గడంతో ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో కూడా పట్టణ ప్రాంతాలతో సమానంగా 25 రోజులకు ఒకసారి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. తక్షణమే అమల్లోకి:అయితే దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలిండర్ బుకింగ్ నిబంధనల్లో తీసుకువచ్చిన ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఎల్పీజీ వినియోగదారులకు భారీ ఊరటగా మారనుంది.